తీన్మార్
తెలుగు దినపత్రిక

## ఉక్కుపై తుక్కు చేష్టలు

విశాఖ ఉక్కు విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనునిత్యం వంచనలకు పాల్పడుతూనేవుంది. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ఏకంగా ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్న మోడీ సర్కార్ ఇప్పటికే పోర్టులు, విమానశ్రయాలు, జాతీయ రహదారులు, అంతరిక్షయానం, రక్షణ రంగం నింగి నేలా హద్దే లేకుండా క్రోనీ మిత్రులకు కట్టబెట్టేస్తోంది.జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి), ఐడిబిఐ వంటి విత్త సంస్థలనూ పప్పులు బెల్లాల్లా కారుచౌకగా పంచేస్తోంది. పోరాటాలు, త్యాగాలతో పురుడుపోసుకొని తెలుగు ప్రజల జీవనగమనంలో మమేకమైన విశాఖ ఉక్కుపైనా కేంద్ర ప్రభుత్వం తన తుక్కు చేష్టలను కొనసాగిస్తోంది. తాజాగా ప్రయివేటీకరణ నుంచి వెనక్కి తగ్గినట్టు కొత్త నాటకానికి తెరలేపి.. అబ్బే అదంతా ఉత్తిదే అంటూ మరోమారు నిస్సిగ్గుగా వంచనకు పాల్పడటం అమానుషం. ఈ నెల 13న విశాఖపట్టణంలో పర్యటించిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే విశాఖ ఉక్కును రాత్రికి రాత్రే ప్రయివేటీకరణ చేసేయ్యబోమంటూ నిండు సభలో బహిరంగ ప్రకటన చేశారు. అదే రోజు సాయంత్రం విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఆయనను కలిసి ప్రయివేటీకరణ కోసం వేసిన అధ్యయన కమిటీలను రద్దు చేయండంటూ విన్నవిస్తే ..ప్రయివేటీకరణ అంశం నా ఒక్కడి చేతిలోనిది కాదంటూ ఉదయం చెప్పిన మాటలకు విరుద్ధంగా కులస్తే కుచ్చుటోపి పెట్టారు. జనాలను నమ్మించడానికి బయట ఏవేవో చెబుతాం..అవన్నీ సీరియస్‌గా తీసుకొంటే ఎలా? అన్నట్టుంది ఆయన తీరు. కులస్తేతో కేంద్రం ఆడించిన ఈ నాటకంపై మీడియాలో కథనాలు రావడంతో విశాఖ ఉక్కు చట్టూ అలజడి మొదలైంది. దీంతో ఇదేదో తిరకాను వ్యవహారంగా మారుతోందని భావించిన కేంద్ర ఉక్కు శాఖ ..విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ ఆగే ప్రసక్తే లేదని ప్రకటించి తన గోముఖం చాటునున్న వ్యాఘ్రం రూపాన్ని బయటపెట్టుకుంది. మతోన్మాదాన్ని రాజేసి ప్రజల ఐక్యతను దెబ్బతీయడం..ఆర్థిక భారాలు మోపి వారిని మరింత కుంగదీయడం, కష్టాల ఊబిలో జనం విలవిల్లాడుతుంటే..అడిగేవాడ్వెడూ ఉండడని ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు దోచిపెట్టే దుర్మార్గపు కుట్రకు మోడీ సర్కార్ పెట్టుకున్న ముద్దు పేరే డిజిన్వెస్ట్‌మెంట్. ప్రత్యేక హెూదా ఇవ్వకుండా, విభజన హామీలు నెరవేర్చకుండా ఆంధ్రప్రదేశ్‌ను ఇప్పటికే నిండా ముంచిన మోడీ సర్కార్ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణనైనా తక్షణం విరమించుకోవాలి. కులస్తే ప్రకటనతో.. చూశారా కేంద్రానికి రాష్ట్రంపై ఎంత ప్రేమో! అంటూ గొప్పలకు పోయిన బిజెపి రాష్ట్ర నాయకుల పరిస్థితి ఒక్క రోజు గడవకముందే కుడితిలో పడిన ఎలుక చందంగా తయారైంది. కేంద్ర మంత్రి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా కేంద్రం తీరుపై తన వైఖరిని స్పష్టం చేయాలి. వంచనకు పాల్పడిన బిజెపి పంచనే కొనసాగుతారో..బయటకు వచ్చి ద్రోహాన్ని నిలదీస్తారో? ఆయనే తేల్చుకోవాలి. విశాఖ స్టీల్‌ను ప్రయివేటుకు కట్టబెట్టడంలో నిమగమైవున్నది కేంద్ర ప్రభుత్వమే అని తెలిసినా..కేంద్రాన్ని పల్లెత్తు మాట అనకుండా ఎంతసేపూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ కాలం వెళ్ల దీస్తున్న టిడిపి కూడా విశాఖ విషయంలో పునారాలోచన చేయాల్సిన అవసరం ఉంది. అబ్బే అదంతా ఉత్తిదే అంటూ మరోమారు నిస్సిగ్గుగా వంచనకు పాల్పడటం అమానుషం. ఈ నెల 13న విశాఖపట్టణంలో పర్యటించిన కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే విశాఖ ఉక్కును రాత్రికి రాత్రే ప్రయివేటీకరణ చేసేయ్యబోమంటూ నిండు సభలో బహిరంగ ప్రకటన చేశారు. అదే రోజు సాయంత్రం విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఆయనను కలిసి ప్రయివేటీకరణ కోసం వేసిన అధ్యయన కమిటీలను రద్దు చేయండంటూ విన్నవిస్తే ..ప్రయివేటీకరణ అంశం నా ఒక్కడి చేతిలోనిది కాదంటూ ఉదయం చెప్పిన మాటలకు విరుద్ధంగా కులస్తే కుచ్చుటోపి పెట్టారు. జనాలను నమ్మించడానికి బయట ఏవేవో చెబుతాం.. అవన్నీ సీరియస్‌గా తీసుకొంటే ఎలా? అన్నట్టుంది ఆయన తీరు. కులస్తేతో కేంద్రం ఆడించిన ఈ నాటకంపై మీడియాలో కథనాలు రావడంతో విశాఖ ఉక్కు చట్టూ అలజడి మొదలైంది. దీంతో ఇదేదో తిరకాను వ్యవహారంగా మారుతోందని భావించిన కేంద్ర ఉక్కు శాఖ ..విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ ఆగే ప్రసక్తే లేదని ప్రకటించి తన గోముఖం చాటునున్న వ్యాఘ్రం రూపాన్ని బయటపెట్టుకుంది. మతోన్మాదాన్ని రాజేసి ప్రజల ఐక్యతను దెబ్బతీయడం..ఆర్థిక భారాలు మోపి వారిని మరింత కుంగదీయడం, కష్టాల ఊబిలో జనం విలవిల్లాడుతుంటే.విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ప్రక్రియ ను ప్రకటించినా కేంద్రం వేగంగా ముందుకెళ్లలేక పోవడానికి రెండేళ్లుగా రాష్ట్రప్రజల మద్దతుతో కార్మికవర్గం సాగిస్తున్న పోరా టమే కారణం. దీర్ఘకాలిక ఐక్య పోరాటాలతోనే మోడీ సర్కార్‌ను వెనక్కికొట్టడం సాధ్యమని ఢిల్లీ రైతు ఉద్యమం పాఠం నేర్పింది. అదే మన ముందున్న మార్గం. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనాఅన్ని రాజకీయ పార్టీలనూ,కార్మిక సంఘాలనూ సంప్ర దించి, ఢిల్లీకి అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి.విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని నినదించి 32 మందిప్రాణ త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగం లోనే కొనసాగించేలా కేంద్రం మెడలు వంచాలి.

# రాయలకే పాలేరు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలి

### – డిమాండ్ చేస్తూ అభిమానులు సమావేశం



పాలేరు, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ కార్యకర్తలు కష్ట కాలంలో ఉన్న సమయంలో నేనున్నానంటూ భరోసా ఇచ్చిన టీపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావుకే పాలేరు టికెట్ ఇవ్వాలనీ డిమాండ్ చేస్తూ నేలకొండపల్లి మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇరవై సంవత్సరాలు గా నియోజకవర్గంలో ఎంతోమంది కి టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు సాయం అందించారన్నారు. తొమ్మిది సంవత్సరాల పాటు పాలేరులో కాంగ్రెస్ పార్టీని నడిపించిన టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావుకి పాలేరు టిక్కెట్ ఇవ్వాలని యువజన నాయకుడు అంజని డిమాండ్ చేశారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటి ఉన్న నాయకుడు రాయల నాగేశ్వర్ రావు అని పాలేరు నియోజకవర్గంలో ప్రతి గ్రామం తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు కష్ట కాలంలో ఉన్న సమయంలో నేనున్నానంటూ నాగేశ్వరరావు భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్సీగా పోటీ చేసి పార్టీకి ఉన్న ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించిన నాయకుడన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని పాలేరు నియోజకవర్గంలో ముందుండి నడిపించిన ఏకైక నాయకుడు రాయల నాగేశ్వరరావు అని, కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తో పాల్గొనడంతో పాటు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రను జిల్లా ల్లో ముందుండి నడిపించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎండనక,వాననక నిరంతరం కాంగ్రెస్ పార్టీని పటిష్టపరిచేందుకు విస్తృత ప్రచారం చేసారని ఇప్పటికైనా ఆయన కష్టాన్ని పార్టీ గుర్తించి పాలేరు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ రాయల నాగేశ్వరరావుకి ఇవ్వాలని కోరుతున్నామని జెర్రిపోతుల అంజని అంజని అన్నారు.

ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు యడవల్లి నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్, మద్ది రాజారెడ్డి, పల్లెబోయిన శ్రీనివాస్, మార్తి కోటి, పగిడిమర్రి అజయ్, భానోతు నరేష్, సంపేట ప్రశాంత్, జంగా బాలక్రిష్ణ, పెద్దపాక ముత్తయ్య, గట్టిగుండ్ల విజయ్, దనవత్ సంతోష్, కుమ్మరి వీరబాబు, హరి, బాలాజీ, కాసాని వెంకటేష్,



అనంతు నాగేంద్ర బాబు, సునీల్, రంజిత్, వడ్డె సుదీర్, మధు, మేకపోతుల సురేష్, అనంతు మనోజ్, తోట వాసు, తాత దిలీప్, కోడిరెక్కల శ్రీకాంత్, పగిళ్ల సాయి, పల్లపు రంగ, కిన్నెర రమేష్, రాంబాబు, వెంకటేష్, కోడిరెక్కల వినోద్, కుక్కల శ్రీను, ఉపేందర్, నవిలీ వీరబాబు, పరిమి వీరబాబు, జానీ, శ్రీను, గట్టిగుండ్ల నాగరాజు, మాదారపు హేమంత్, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చిరు సన్మానం

### – సత్కరించిన రామన్నపేట ఎస్బిఐ మేనేజర్ భాస్కర్



రామన్నపేట, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): మడలం కేంద్రంలో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నందు సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సందర్భంగా మనం జరిపుకునే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు బ్యాంకు ఆవరణలో మేనేజర్ కె భాస్కర్, అకౌంటెంట్ వెంకటేశ్వర్లు మరియు సిబ్బందితో కలిసి రిటైర్డ్ హెచ్ఎం సిరిపురం జడ్పీహెచ్ఎస్ గోవర్ధన చారి మరియు రిటైర్డ్ ఎంఈవో బొడ్డు వెంకటేశంలను సన్మానించి ఘనంగా నిర్వహించారు. సమాజంలో ఉపాధ్యాయుల హస్తాన్ని గుర్తు చేసుకున్నారు. ఎవరు ఎంత అడిగినా ఆ ఘనత అంత చదువు నేర్పిన గురువులకు దక్కుతుందని కొనియాడారు. తమ విద్యార్థులు ఎంత ఎదుగుతుంటే అంత సంతోషం వ్యక్తం చేసే వారిలో తల్లిదండ్రుల తర్వాత గురువులే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ లో కృష్ణాష్టమి వేడుకలు



మక్తల్, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): మక్తల్ పట్టణంలో కృష్ణాష్టమి సందర్భంగా స్థానిక వేణుగోపాల స్వామి దేవాలయ కమిటీ సభ్యులు ఒకరోజు ముందుగానే బుధవారం కాలినడకన పసుపుల తీరంలో ఉన్న క్రిష్ణ నదికి వెళ్లి పవిత్ర నది జలాలను తీసుకొని వచ్చారు. అనంతరం గ్రామ శివారు నుంచి మేళ తాళాలు, భజనలు, పాటలు మధ్య వేణుగోపాల స్వామి దేవాలయానికి వెళ్లి జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భజన బృందం, తదితరులు పాల్గొన్నారు.

# తల్లి బిడ్డకు తప్పిన ప్రాణాపాయం

### – ఉదృతంగా ప్రవహిస్తున్న వాగు దాటలేక నిలిచిన అబులేన్స్
### – సర్పంచ్ భర్త చొరవతో తల్లిబిడ్డ సేపు
### – ఇంకెన్నాళ్ళు ఈ దుస్థితి అంటున్న ప్రజలు...?



పాలేరు, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు అవుతుంది. ఏముంది గొప్పలు చెప్పడానికే తప్ప చినుకు పడితే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పుడో ఏళ్లనాటి క్రితం గ్రామాల్లో వాగులపై కట్టిన వంతెనలు, ఆనాటి పరిస్థితులకి అనుగుణంగా జనాలు రాకపోకలకు సాగించడానికి వరద ఉదృతి అంచనా వేయకుండా కట్టిన వంతెనలు రాను రాను దెబ్బతిన్నవి కొన్ని బారి వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న వాగులను దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగించల్సిందే. అలాంటి వంతెనలు ఇంకా మోక్షం లభించలేదు. ఇక అసలు విషయానికి వస్తె కూసుమంచి మండలం, ఎర్రగడ్డతండా గ్రామానికి చెందిన బానోత్ చైత్ర నిండు గర్భిణి. ఈ రోజు సాయంత్రం సమయంలో విపరీతమైన నొప్పులు రావడంతో అంబులెన్స్ కి కాల్ చేశారు. వెంటనే వచ్చిన అంబులెన్స్ గర్భిణిని ఎక్కించుకొని హాస్పిటల్ కి బయలు దేరింది. కానీ కొత్తూరు



– నరసింహులగూడెం గ్రామాల మధ్యలో ఉన్న వాగు గత మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పొంగి ప్రవహిస్తుంది. అయితే ఎర్రగడ్డతండా గ్రామానికి వెళ్లేటప్పుడు అంబులెన్స్ డ్రైవర్ దైర్యంగా వాగును దాటించగలిగాడు కానీ గర్భిణిని ఎక్కించుకొని వచ్చేటప్పటికి వరద ఉదృతి పెరగడంతో అంబులెన్స్ ను వాగును దాటించడానికి సాహసించలేకపోయాడు. దీంతో విపరీతమైన నొప్పులతో విలవిలలాడింది. వెంటనే స్థానిక సర్పంచ్ అనసూయ శ్రీనివాస్ స్పందించి గ్రామ పంచాయితీ ట్రాక్టర్ లో గర్భిణీ చైత్రని వాగు దాటించి తల్లి బిడ్డ ప్రాణాలు కాపాడారు. గర్భిణీ చైత్రని ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ లో అడ్మిన్ చేయగా పండంటి ఆడబిడ్డకు జన్మిచ్చింది. ఇంకొంచెం సమయం వాగు దగ్గర ఆలస్యం అయ్యి ఉంటే కడుపులోని బిడ్డ ఉమ్మనీరు తాగితే బిడ్డకు ప్రమాదం జరిగేదని, సర్పంచ్ జర్పుల అనసూయ శ్రీనివాస్ తీసుకున్న చొరవతో తల్లి బిడ్డ ప్రాణాలు దక్కాయి. ఈ వంతెన పైన ఉన్న 10 గ్రామాల ప్రజలు వరదలు వచ్చినప్పుడు ప్రయాణం సాగించాలి అంటే కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఎదైన జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు అని ఆగ్రహం వ్యక్తం అవుతుంది. ఇకనైనా ఆ వాగు పై కొత్త వంతెనను నిర్మించి వరదలు వచ్చినప్పుడు ప్రజలు ఇబ్బందులు పడకుండా వెంటనే నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# ఓటర్ నమోదుకు సహకరించాలి



### – అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరు, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): ఓటర్ నమోదుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. బుధవారం ఆలేరు తాసిల్దార్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో బిఎల్వోలు ఓటర్ నమోదు చేసుకుంటున్నారని, కొత్తగా ఓటు దరఖాస్తు చేసుకునేవారు వారిని సంప్రదించి ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు కూడా నూతన ఓటర్లు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి,డిటి ప్రవీణ్ కుమార్, ఆర్ఐ నరేంద్ర చారి, అఖిలపక్ష నాయకులు పంతం కృష్ణ, జూకాంటి పాల్, తదితరులు ఉన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన గట్టు నిఖిల్



తుర్కపల్లి, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో కోట లావణ్య అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బారాస యువ నాయకులు గట్టు తేజస్వి నిఖిల్ వారి ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇమ్మడి మల్లప్ప, మండల నాయకులు కసరబోయిన కనకరాజు, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్, గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు సిలివేరు పరశురాం, యూత్ అధ్యక్షుడు సిలువేరు భాష, కోట నరసింహ, కోట బిక్షపతి, బొడ్డు బాలనరసింహ, కోట భాస్కర్, కోట రాజు, కోట వేణుగోపాల్, సందపల్లి భాష, కొండల్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ మైండ్స్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు



పెబ్బేరు, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): పెబ్బేరు పట్టణంలోని మాస్టర్ మైండ్స్‌పాఠశాలలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో కనువిందు చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు. అనంతరం కోలాటాలు ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లావణ్య రంగారెడ్డి మాట్లాడుతూ మన సంప్రదాయాలను విద్యార్థులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలో వేడుకలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిని కలిసిన మంబాపూర్ మైనార్టీ నాయకులు

### – తాండూర్ కి మరల కాబోయే ఎమ్మెల్యే పైలెట్
### – బిఆర్ఎస్ పార్టీ పెద్దేముల్ మాజీ అధ్యక్షులు ఎస్ నారాయన్ రెడ్డి




పెద్దేముల్,సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి జాబితాలో తాండూరు నియోజకవర్గం నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నగారికి రెండవసారి టికెట్ కేటాయించారు. ఈ సందర్భంగా హైదరాబాదులోని తన నివాసంలో ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని పెద్దేముల్ మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.నారాయన్ రెడ్డి ఆధ్వర్యంలో మంబాపూర్ బిఆర్ఎస్ మైనారిటీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంబాపూర్ మైనార్టీలకు ఎస్డిఎఫ్ కింద ఈద్గా దగ్గర పనులకు 9లక్షలు, మరియుఒక బోర్,ఎమ్మెల్యే వేయించారు. మైనార్టీలరుణాల క్రింద ఆకుల ఆఫీసబ్ మంజూర్‌కు రూ.100000/- చెక్కులను ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, అందజేశారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు పాల్గొని ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముజీఫ్, సజ్జత్, ఆకుల గౌస్, మొల్ల గౌస్, మొల్ల హుస్సేన్, ఆఫీసబ్, మంజూర్, మొల్ల ఖలీల్, సిరాసత్, బషీర్, గోరేమియా, ఎండి సద్దామ్, తదితరులు పాల్గొన్నారు.

# ఐదు నెలల వేతనాలు చెల్లించాలి

బెజ్జూరు, బెజ్జూరు పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న తమకు రావల్సిన ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాల ని పారిశుధ్య కార్మికులు రాస్తారోకో చేపట్టారు. పంచాయ తీలో 20 మంది కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడంతో రాస్తారోకో చేపట్టి భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తమకు ఐదు నెలల వేతనాలు చెల్లించాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకో వడం లేదని ఆవేద వ్యక్తం చేశారు. డీపీవో, సర్పంచ్ రావాలని నినాదాలు చేశారు. సాంకేతిక లోపాన్ని ఎత్తి చూపుతూ తమకు వేతనాలు ఇవ్వడం లేదంటూ మండి పడ్డారు. వేతనాలు చెల్లించకుంటే పాలక వర్గం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి వెళ్లమంటూ బైఠాయించారు. పంచాయతీ కార్య దర్శి తుకారాం అక్కడికి చేరుకుని కార్మికులతో మాట్లాడి 15 రోజుల్లోగా వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# చినుకు పడితే చిత్తడే....



- అధ్వానంగా గ్రామాల్లో అంతర్గత రోడ్లు
- ఉత్తమ పంచాయితీల పరిస్థితి కూడా అధ్వాన్నం
- గుంతల్లో పిడికెడు మొరం మట్టి పోయలేదు
- అభివృద్ధికి దూరంగానే చిన్న గ్రామ పంచాయితీలు
- నిర్లక్ష్యంగా సర్పంచులు, కార్యదర్శులు...



**కూసుమంచి,సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): సీసీ రోడ్లు లేని గ్రా మాల దుస్థితికి అద్దంపట్టే దృశ్యాలు ఒక్కో గ్రామంలో ఒక్కో సమస్య ఉండడం మామూలే కానీ వర్షాకాలం వచ్చిందంటే మండల కేంద్ర ము నుండి మారుమూల ఉన్న చిన్న గ్రామాల వరకు ఒకటే ప్ర ధాన సమస్య రోడ్లు,సీసీ రోడ్లు సరిగా లేక,ఉన్న రోడ్లకు సైడ్ కా ల్వలు లేక, రోడ్లపైనే బురద, బయటకి అడుగు పెడ దాం అంటే నరకయాతన. బురద రోడ్లతో ఎన్నో ఏళ్లుగా మండల ప్రజానీకం ఇబ్బందులకు గురి అవుతున్న సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎంత అధ్వానంగా గ్రామాల్లో రోడ్లు ఉన్నాయి అంటే కనీసం అడుగు బయట పెట్టలేని పరిస్థితి ఆ వర్షపు బురదలో కూరుకుపోయిన గ్రామాల దుస్థితి గత మూడు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామాలు బురద మయం అయ్యాయి.**

**తీసికట్టుగా లేని ఉత్తమ పంచాయితీలు:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు బీఆర్ఎస్ పాలన వరకు మండలంలో అనేక గ్రామాలు ఉత్తమ గ్రామ పంచాయితీలుగా ఎంపికైయ్యాయి. అటువంటి గ్రామాలకు ప్రోత్సాహకంగా కొన్ని నిధులు మంజూరు అ య్యాయి. ఉత్తమ గ్రామ పంచాయితీలుగా ఎంపిక కావాలంటే తప్పక గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, బహిరంగ మలవిసర్జన నిర్మూలన, స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన రోడ్లు లాంటి అనేక అంశాల ను ప్రామాణికంగా తీసుకుని ఎంపిక చేయాలి.

గతం నుండి ఇప్పటి వరకు వాటికి అనుగుణంగా ఆదర్శ, ఉత్తమ గ్రామాల ఎంపిక జరిగుంటే, ఇప్పుడు ఉత్తమ గ్రామ పంచాయితీల దుస్థితికి కారణం ఏమిటని పలు ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా ఉన్న గ్రామపం చాయితీలను గుడ్డిగా ఎంపిక చేసినట్టు స్పష్టం అవుతున్నాయి. ఇటీవల కొత్తగా ఏర్పడి అభివృద్ధికి సరైన నిధులు రాకా ఇబ్బందులు పడుతున్నా గ్రామ పంచాయితీలకు ఏ మాత్రం తీసికట్టుగా లేని ఉత్తమ గ్రామ పంచాయితీలను మండలంలో చూడవచ్చు.

**ముందస్తు జాగ్రత్త ఎది..?**

గతంలో మూడు నాలుగు గ్రామాలకు కలిపి ఒకరే పంచాయితీ సెక్రటరీ ఉన్నప్పుడు కూడా సెక్రెటరీ, సర్పంచ్ ముందస్తు జాగ్రత్తగా వర్షాకాలం రావడానికి ముందే వేసవి కాలంలో తమ గ్రామాల్లోని గుంతలు పడిన రోడ్లకు మరమ్మత్తుగా గుంతల్లో మొరం మట్టి పోయించే వారు. అలాగే మురద వచ్చే అవకాశం ఉన్న రోడ్లకు సైడ్ కాల్వ లు తిపించి వరద, బురద రోడ్ల మీదకు రాకుండా చర్యలు చేపట్టే వారు.



కానీ ఇప్పుడు గ్రామానికి ఒక సెక్రెటరీ ఉన్న పాలనపై దృష్టి సారించకపోవడం తో గ్రామాల్లోని రోడ్లు బురదతో దర్శనం ఇస్తున్నాయి. అలాగే సర్పంచులు కూడా ఎంత సేపటికీ ప్రభుత్వం నుండి సీసీ రోడ్లు వస్తాయని ఎదురు చూస్తున్నారు తప్ప వర్ష కాలంలో ప్రజలకు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్న పాపాన పోలేదని అర్థం అవుతుంది. ఒక్క గ్రామ పంచాయితీ కూడా తమ గ్రామాల్లో మొరం తోలినట్టు కనపడడం లేదు. ప్రజలు తమ రోడ్లకు మొరం పోయించమని చెప్పిన వారి మాటలు పేడ చెవిన పెట్టీ, రాని సీసీ రోడ్ల కోసం తమ గ్రామానికి నిధులు కేటయించలేదని సాకులను ప్రజలకు సర్పంచులు, సెక్రటరీలు చెప్పడం వారి వంతైంది. మొరం దొరకడం లేదని ఒక గ్రామ, ఎదో తుతు మంత్రంగా నాలుగు ట్రాక్టర్ ట్రిప్పులు మట్టి తోలించడం చేతులు దులుపుకోవడం మినహా గ్రామ అభివృద్ధి పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేదని ప్రజలు వాపోతున్నారు. అలాగే మట్టి పోయించినట్టు బిల్లులు చేపించున్నట్టు పలు గ్రామ పంచాయితీలపై ఆరోపణలు వస్తున్నాయి .

**నిధుల కేటాయింపులో చిన్న చూపు..?**

సీసీ రోడ్లు లేని గ్రామ పంచాయితీలకు ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని గత 4 ఏళ్లుగా పలు గ్రామ పంచాయితీల సర్పంచులు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరిన ఊరికి ఒకటి, రెండు రోడ్లు మాత్రమే ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇక చిన్న గ్రామ పం చాయితీలకు సీసీ రోడ్ల కోసం మరిన్ని నిధులు అవసరం ఉన్న ఆ గ్రామ పంచాయితీలపై చిన్న చూపే మిగిలిం దని సర్పంచుల నుండి ఆవేదన వ్యక్తం అవుతుంది. తెలంగాణ రాష్ట్రం జాతీ య స్థాయిలో కూడా ఉత్తమ గ్రామ పంచాయితీలుగా వెలుగొందుతున్న క్రమంలో కూడా మండలంలో కొన్ని గ్రామ పంచాయితీలు అభివృద్ధికి దూ రంగానే ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కొన్ని లక్ష్యాలను చేరినట్టు కనిపించడం లేదు. గ్రామాల్లో స్మశావాటిక, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్ వంటివి కనిపిస్తున్న ప్రజలు నడవడానికి సరైన రోడ్లు లేక బురదలో నడవాల్సిన పరిస్థితి దాపురించింది. సీసీ రోడ్లు లేని గ్రామాలకు ప్రత్యేక నిధులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆత్మహత్యకు పాల్పడిన డిగ్రీ విద్యార్థినుల ఘటనపై

# సమగ్ర విచారణ జరపాలి

**- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి డిమాండ్**





నల్లగొండ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు అనుమానస్పదంగా ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు.

ఈరోజు ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించి మృతి చెందిన విద్యార్థులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ సోషల్ మీడియా టీవీల ప్రభావము సెల్ఫోన్లో ప్రభావము వలన యువతీ యువకులు పక్కదారి పడుతున్నారని అదుపులేని ఇంస్టాగ్రాములు వాట్సాప్ లో మనుషుల ప్రాణాలు తీస్తున్నా యని అన్నారు. విద్యార్థినిల వాయిస్ రికార్డు బయటకు వచ్చిందని దాని ప్రకారంగా ఇన్స్టాగ్రామ్ లో వారి డీపీలను మార్చి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వారు గడ్డి మందు తాగిన తదుపరి మాట్లాడిన మాటలు పరిగణలోకి తీసుకొని విచారణ జరపాలని కోరారు.

జిల్లా పోలీసు యంత్రాంగం సమగ్ర విచారణ జరపాలని వారి కాల్ డేటా ఆధారంగా దోషులు ఎవరైనా ఉంటే దొరకబట్టి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, జిల్లా కమిటీ సభ్యురాలు కనుకుంట్ల ఉమా రాణి, బొల్లేపల్లి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల మండల బీఎస్పీ పార్టీ మహిళా కన్వీనర్ గా పాల భవాని

చిట్యాల, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): చిట్యాల మండల బిఎస్పి పార్టీ మహిళా కన్వీనర్ గా చిట్యాల మున్సిపాలిటీ చెందిన పాల భవాని ని నకిరేకల్ మహిళ కన్వీనర్ మర్రి శోభ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాల భవాని మాట్లాడుతూ చిట్యాల మండలంలో మహిళలు ఎంతో వెనుకబడి ఉన్నారని, వారికోసం కష్టపడి పని చేస్తానని ఆమె అన్నారు.

మహిళలను గుర్తింపు తెచ్చేవిదంగా బిఎస్పీ పార్టీ కీలకమైన పోస్టులు ఇస్తున్నారని అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీలో మండల మహిళా కన్వీనర్ గా పనిచేయడం నాకెంతో ఆనందంగా ఉందని, పార్టీ అధినేత మాయావతిని స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ఎంతో అవుతున్నారన్నారు. భవిష్యత్ కార్యాచరణలో చైతన్యవంతులు మహిళలు ముందుకు తీసుకెళ్లడమే నా బాధ్యతగా నిర్వహిస్తారని ఆమె అన్నారు. మహిళలను గుర్తించి కీలకమైన స్థానంను కల్పించడంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు



ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కే ఆ విలువలు దక్కుతాయన్నారు. నా ఎంపికకు సహకరించిన నియోజకవర్గ ఇంచార్జి మేడి ప్రియదర్శిని కి కృత్తతలు తెలిపారు.

# 'ఆశా 'లకు ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలి

**- జిల్లా నేత జయప్రకాశ్ డిమాండ్**



రాజోలి, సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రము లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నెలకు 18వేల ఫిక్స్ వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు అందరూ యూనియన్ జిల్లా నేత జయప్రకాశ్ ను కలిసి తమ కు మద్దతు ఇవ్వాలని వినతి పత్రం ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 18 ఏళ్ళుగా విధులు నిర్వర్తించే ఆశా వర్కర్లు సమస్య లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వము స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామం లో ఉంటూ ఇంటింటికి తిరిగి ప్రజలకు అన్ని రకాల వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నారు అని ఆయన అన్నారు. బిపి షుగర్ థైరాయిడ్ జ్వరము తదితర లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ఇస్తున్న మందులను రోగులకు అందజేస్తున్నారు అని ఆయన అన్నారు.

గర్భిణీ స్త్రీలకు శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పంచడానికి వారిని ప్రతి బుధవారం శనివారం సబ్ సెంటర్ కు తరలించి టీకాలు వేయిస్తున్నారని ఆయన అన్నారు.

గర్భిణీ స్త్రీలు కాన్పు కావడానికి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి కాన్పులు చేయిస్తున్నారని ఆయన అన్నారు. కరోనా కష్ట కాలము లో కూడా కరోనా ను నియంత్రించడం లో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషించారు అని ఆయన వారిని కొనియాడారు.

ఆశా వర్కర్లు చేసిన పనిని గుర్తించి ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లు కు అవార్డు ను ప్రకటించడం జ రిగింది అని ఆయన అన్నారు. ఇన్నీ సేవలు అందించిన ఆశా వర్కర్లు కు ఫిక్స్ వేతనం ఇవ్వకపోవడం శోచనీయం అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఆశా వర్కర్లు కు నెలకు రూ.9750/- రూపాయలు మాత్రమే ఇస్తున్నారని అలా కాకుండా రూ.18000/- రూపాయలు ఫిక్స్ వేతనం చెలించాలని ఆయన తెలిపారు. అలాగే ఆశా లకు హెల్త్ కార్డ్, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కింద 5 లక్షలు ఇవ్వాలని, ఆశా వర్కర్లు కు ప్రసూతి సెలవు ప్రకటించాలని అన్నీ రకాల రిజిష్టర్ లు ప్రభుత్వమే సప్లయ్ చేయాలని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వము చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు వెయ్యి రూపాయల చొప్పున 16నెలల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జోగులాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ జయప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రంజిత్ కుమార్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయులు

## సీఎం కెసిఆర్ పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు - ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య





నకిరేకల్ ప్రతినిధి,సెప్టెంబర్ 06(తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో విద్యారం గంలో వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టి విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత సీఎం కెసిఆర్ కు దక్కుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ 136 వ జయంతి సందర్భంగా బుదవారం నకిరేకల్ పట్టణంలోని సువర్ణ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం స్వీకరించిన సందర్భంగా నియోజ కవర్గ స్థాయిలో ఆత్మీయ సన్మానం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై ఉపాధ్యాయులను మెమెంటో లను నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అందజేసి సన్మానించారు.

ఆనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ గురుకులాలు దేశానికే రోల్ మోడల్ గా నిలిచాయన్నారు. గురుకులాల్లో చేరడానికి విధ్యా ర్థులు చూపిస్తున్న స్పందనే వాటి విజయానికి నిదర్శనమన్నారు. ఈ విజయంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ఎమ్మెల్యే కొనియాడారు.



# శిథిలావస్థలో పోచారం కెనాల్!

కామారెడ్డి,: జిల్లాలోని నాగిరెడ్డిపేట మండలంలో ఉన్న పోచారం ప్రాజెక్టు మెయిన్ కెనాల్ శిథిలావస్థకు చేరుతోంది. ఏళ్లుగా కెనాల్ మెయింటెనెన్స్, రిపేర్లు చేయడపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీళ్లు చేరడం కష్టంగా మారుతోంది. ప్రాజెక్టు ఎత్తు పెంపుతో పాటు కెనాల్ ఆధునికీకరణపై శ్రద్ధ చూపాల్సిన ఆఫీసర్లు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. 100ఏండ్ల కింద నిర్మించిన ప్రాజెక్ట్ చెక్కు చెదరకపోయినా.. 15 ఏండ్ల కింద నిర్మించిన మెయిన్ కెనాల్ సైడ్ వాల్ కూలిపోవడం ఆందోళన కలిగిస్తోంది.దీంతో కెనాల్ ద్వారా ఆయకట్టుకు నీళ్లు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే రిపేర్లు చేపట్టాలని డిమాండ్ చేస్తు న్నారు. పోచారం ప్రాజెక్టును 1922లో నిజాం ప్రభుత్వ హయాంలో నిర్మిం చారు. నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లో 1,500 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించేందుకు అప్పట్లోనే 58 కి. మీ మేర కెనాల్ తవ్వారు. మెయిన్ కెనాల్ నుంచి నీళ్లు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ కూడా తవ్వించారు. ప్రాజెక్టును ఏ,బీజోన్లు గా విభజించి వరి సాగుకు నీళ్లు ఇస్తున్నారు. వానాకాలంలో రెండు జోన్లకు నీళ్లిస్తుండగా, యాసంగిలో ఏడాదికి ఒక జోన్ కు మాత్రమే నీళ్లు విడుదల చేస్తారు.

ప్రాజెక్టు మెయిన్ కెనాల్ లైనింగ్ పనులు 20 07లో రూ.80 కోట్లతో చేపట్టారు. కెనాల్ కు రెండు పక్కల రాళ్లు, కింద సిమెంట్ బెడ్ వేశారు. లైనింగ్ నిర్మాణం తర్వాత కొన్నేళ్ల వరకు సాగు నీళ్లు చివరి ఆయకట్టు వరకు కూడా సజావుగా వచ్చాయి. కానీ కెనాల్ వెంట లైనింగ్ శిథిలమైంది. సిమెంట్ ఊడిపోయి రాళ్లు పడిపోతున్నాయి. కింద వేసిన లైనింగ్ కొట్టుకు పోయింది. నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లోని పలు చోట్ల సిమెంట్ పనులు పగుళ్లు వచ్చాయి.

## ఎల్లంపల్లి ప్రాజెక్ట్
# పరిహారం కోసం ఎదురుచూపులు



మంచిర్యాల,: ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం సాగుభూములు, ఇండ్లు త్యా గం చేసిన భూనిర్వాసితులు 15 ఏండ్ల నుంచి పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. న్యాయం చేయాలని లీడర్ల, అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికే పలుమార్లు గ్రామాల్లో, కలెక్టరేట్ వద్ద ఆందోళనలు నిర్వ హించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో హాజీపూర్ మండలం గుడిపేట, నంనూర్ , చందనాపూర్ , రాపల్లి, పడ్తనపల్లి, కర్ణమామిడి, కొండా పూర్ తో పాటు లక్సెట్టిపేట మండలంలోని సూరారం, గుల్లకోట గ్రామాలు మునిగిపోయాయి. తొమ్మిది గ్రామాలతో పాటు ఆరు వేల ఎకరాలకు పైగా భూములు ముంపునకు గురయ్యాయి. నాలుగు వేలకు పైగా కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. వీరికి ఆర్అండ్ఆర్ కాలనీల్లో ఇండ్లు కట్టుకునేందుకు ప్లాట్లు కేటాయించారు. ఇల్లు కట్టుకుంటే ఇందిరమ్మ ఇంటి సాయం కింద రూ.70 వేల ఆర్థికసా యం అందిస్తామని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. టీఆర్ ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇల్లు కట్టుకున్న వారితో పాటు మిగతా వాళ్లకు సైతం రూ.70వేల చొప్పున అందిస్తామని 2017లో ప్రభుత్వం జీవో రిలీజ్ చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ఇందిరమ్మ ఇంటి పైసల కోసం అర్హత గల భూనిర్వాసితులు దరఖాస్తు చేసుకున్నారు. వాటి పరిశీలనతోనే ఏడాదికిపైగా కాలం గడిచిపోయింది. చివరకు 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వం 3,440 మందికి రూ.70వేల చొప్పున రూ.24.80 కోట్లు రిలీజ్ చేసింది. మరో 880 మందికి సంబంధించిన దరఖాస్తులను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. పరిశీలనలు, అభ్యంతరాలు, అడ్డంకులను దాటి ఈ ఫైల్ ముందుకు కదిలింది. ఇది ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ దగ్గర పెండింగ్‌లో ఉందని అధికారులు పేర్కొంటున్నారు. వీరికి రూ. 6.16 కోట్లు రావాల్సి ఉంది. అలాగే మరో 1,100 మందికి రూ.7.70 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు దరఖాస్తులు కూడా తీసుకోలేదు. 2004 డిసెంబర్ లో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. 2006 నాటికి భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. 2008లో నిర్మాణం ప్రారంభమై 2013లో పూర్తయింది. అప్పటి నుంచి భూనిర్వాసితులకు విడతల వారిగా పరిహారం చెల్లిస్తున్నారు. 15 సంవత్సరాలు కావస్తున్నా ఇంకా ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పెండింగ్ పరిహారం డబ్బులు వెంటనే చెల్లించాలి. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులను తిప్పలు పెడుతోంది. ప్రాజెక్టు నిర్మాణం సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న నడిపెల్లి దివాకర్ రావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీగా ఉన్న కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కమీషన్లు దండుకుని నిర్వాసితులకు అన్యాయం చేశారు. పెండింగ్ లో ఉన్న నష్టపరిహారం వెంటనే చెల్లించకుంటే నిర్వాసితుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తాం.


# ఈ ఏడాది పత్తి రైతులకు నష్టాలే



ఆదిలాబాద్ :తెల్లబంగారానికి ప్రసిద్ధి చెందిన ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది పత్తి రైతులకు నష్టాలే మిగిలాయి. ఊహించని విధంగా ధర పడిపోవడం.. నెలల తరబడి నిల్వ ఉంచిన ధర పెరగక పోవడంతో నిరాశే మిగిలింది. పత్తి కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నా.. వ్యాపారులు ధరలు పెంచకపోవడంతో తక్కువ ధరకే పత్తి అమ్ముకోవాల్సి వస్తుంది. వ్యాపారుల సిండికేట్ గా మారి ధరలు పెరగకుండా చేస్తున్నారని, దీంతో గతేడాదితో పోలిస్తే రైతులు కోట్ల రూపాయలు నష్టపోతున్నట్లు రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.జిల్లాలో ఆదిలాబాద్, జైనథ్, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ మార్కెట్లలో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది 3 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 20 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలు కురిసి చాలావరకు పంట నేలపాలై, దిగుబడి తగ్గింది. అక్టోబర్ లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాగా ఇప్పటి వరకు 9 లక్షల క్వింటాళ్లు మాత్రమే మార్కెట్ కు వచ్చింది. అటు జిల్లాలో వ్యాపారులు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో దాదాపు 2 లక్షల క్వింటాళ్ల పత్తి మహారాష్ట్రకు తరలిపోయినట్లు సమాచారం. అక్కడ క్వింటాల్ కు రూ. 9 వేల ధర పలకడంతో సరిహద్దు గ్రామాల్లన్నీ అక్కడి మార్కెట్లకే పంటను తరలించారు. ప్రస్తుతం కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. మరో 50 వేల క్వింటాళ్ల వరకు మాత్రమే పత్తి మార్కెట్ కు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గతేడాది పత్తి ధర క్వింటాల్ కు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు పలికింది. దాదాపు 9 లక్షల క్వింటాళ్ల పంటను గతేడాది కొనుగోలు చేశారు. ఈ ఏడాది రైతులు రూ.7,500కు మించి ధర పలకలేదు. దీంతో ప్రతీ రైతు క్వింటాల్ కు రూ. 2 వేల వరకు నష్టపోయాడు. ఈ లెక్కన గతేడాదితో పోలిస్తే ఈ ఏడు రూ.180 కోట్ల నష్టం వచ్చింది. గతేడాది చివరలో దాదాపు రూ. 12 వేల ధర కూడా పలికింది. దీంతో ఈ ఏడాది కూడా అదే రీతిలో ధరలు వస్తాయని రైతులు ఆశించారు. మొదట్లో రూ. 9 వేలు పలికిన ధర కొన్ని రోజులు మాత్రమే నిలకడగా ఉంది. ఆ తర్వాత రోజురోజుకు పడిపోతూ వచ్చింది.

దాదాపు రెండు నెలలు రూ. 7 వేలు కూడా దాటని ధర వారం రోజుల నుంచి రూ. 7650 పలుకుతుంది. ఇప్పటికే 90 శాతం మంది రైతులు రూ.7వేల ధరకే పత్తిని అమ్ముకున్నారు. ఇటు వర్షాలు, చీడపీడల పురుగులతో దిగుబడి ఎకరానికి 5 క్వింటాళ్ల కూడా రాలేదు.ప్రతీ ఏడాది వ్యాపారులు పత్తి కొనుగోళ్లలో రైతులను మోసం చేస్తూనే ఉన్నారు. మార్కెట్ కు వచ్చిన పంటలో తేమ శాతం ఎక్కువగా ఉందని కోతలు విధిస్తూనే.. మరో వైపు గిట్టుబాటు ధర రాకుండా సిండికేట్ గా మారి రైతులకు నష్టం కలిగిస్తున్నారు. ఈ ఏడాది ధర పెంపు విషయంలో వ్యాపారులు అడుగు ముందుకేయడం లేదు. ఒకరోజు రూ.30 పెంచితే మరుసటి రోజురూ. 50 తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో రైతులు వడ్డీలు కట్టలేక దళారులకు అమ్ముకొని అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది.

# పుచ్చకాయ సాగు బహు బాగు



ఆదిలాబాద్, : ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వానకాలంలో పత్తి, కంది, సోయాబీన్, యాసంగిలో శనగ, జొన్న, గోధుమ పంటలను సాగు చేస్తారు. ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువుల సరఫరా మొదలుకొని పంటల కొనుగోళ్ల వరకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. దీంతో జిల్లాలో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. ఈ పంటలతో పాటు రెండు సీజన్లలో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతోటల సాగు వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ వ్యవధిలో ఎక్కువ లాభాలు ఇచ్చే పంటలను పండిస్తున్నారు. జిల్లాలో పండిన ఆకుకూరలు, కూరగాయలు స్థానిక మార్కెట్లు, అంగళ్లలో విక్రయించడంతో పాటు నిజామాబాద్, హైదరాబాద్, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు తీసుకుపోయి అమ్ముకుంటున్నారు. జిల్లాలో రైతులు సాగుచేసే టమాట, వంకాయ పంటలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ పంటలను వ్యాపారులు మంచి ధర చెల్లించి కొనుగోలు చేస్తారు. జామ, ఆపిల్‌బేర్, మామిడి, పుచ్చకాయ, మస్కమిలన్ లాంటి పండ్ల తోటలను సైతం రైతులు పెంచుతున్నారు. ఎండాకాలంలో ప్రజలు ఎక్కువగా వినియోగించే వాటర్ మిలన్ పంటకు మంచి గిరాకీ ఉండడంతో దీని విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నది. జిల్లాలో వాటర్‌మిలన్ సాగు రైతులకు లాభదాయకంగా మారుతున్నది. జిల్లా వ్యాప్తంగా ఏటా ఈ పంట సాగు విస్తీర్ణం పెరుగుతుండగా.. ఈ ఏడాది 130 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. పంట కాల వ్యవధి 65 రోజులు ఉంటుందని, సాగులో మెళకువలు పాటించి తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం గడించవచ్చని రైతులు అంటున్నారు. ఎకరాకు 200 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండగా.. కిలోకు రూ.8 నుంచి రూ.10 వరకు రైతులు విక్రయిస్తున్నారు. ఎండాకాలంతో పాటు రంజాన్ పండుగ ఉండడంతో వాటర్ మిలన్‌కు మంచి గిరాకీ ఉంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈ పంట విక్రయాలు కొనసాగుతుండగా.. హైదారాబాద్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. ఆయా రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేసి తీసుకుపోతున్నారు. వాటర్‌మిలన్ పంట సాగులో అన్ని ఖర్చులు పోనూ ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వ్యాపారులు పుచ్చకాయలను కొనుగోలు చేసి జిల్లాలో ఎక్కువ ధరకు విక్రయించేవారు. ప్రజలు అధిక ధరలకు కొనుగోలు చేసి నష్టపోయేవారు.

# సబ్‌స్టేషన్ నిర్మాణంతో తీరిన కరెంట్ కష్టాలు



మాచారెడ్డి, : మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో కరెంట్ కష్టాలు తీరిపోయాయి. దీంతో వ్యాపారస్తులు, గృహ వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి మాచారెడ్డి జీపీకి అనుసంధానంగా ఉన్న గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామానికి నిత్యం విద్యుత్ సమస్యలు ఉండేవి. గజ్యానాయక్ తండా గ్రామం వ్యాపార, వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్నది. ఈ దశలో లో వోల్టేజీ సమస్య ఎక్కువైంది. మాచారెడ్డి, చుక్కాపూర్, కొత్తపల్లి, గజ్యానాయక్‌తండా నాలుగు గ్రామాలకు కలిపి ఒకే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండగా వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కడ ఎల్సీ తీసుకున్నా నాలుగు గ్రామాల్లో కరెంట్ కట్ అయ్యేది. చుక్కాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నిత్యం విద్యుత్ సమస్య ఉండేది. గతంలో లో–వోల్టేజీ సమస్య ద్వారా ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయేవి. ఇప్పుడు నాణ్యమైన విద్యుత్ సరఫరాను చేయడంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ హంజినాయక్, బీఆర్ఎస్ నాయకులు వరంగల్‌లోని ఎన్పీడీసీఎల్ ఆపరేషనల్ డైరెక్టర్ నర్సింగ్‌రావును పలుమార్లు కలిసి విద్యుత్ సమస్యపై విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో పలు మార్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనం ప్రారంభానికి వచ్చిన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లగా వెంటనే మంజూరు చేస్తూ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. వేగంగా పనులు పూర్తి చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేసుకోగా గత నెల 28న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అధికారులతో కలిసి ప్రారంభించారు. విద్యుత్ సమస్య వస్తే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎన్నో ఏండ్ల నుంచి విద్యుత్ సమస్య ఉంది. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన పరిష్కరించలేదు. ఎన్పీడీసీఎల్ ఆపరేషనల్ డైరెక్టర్ నర్సింగ్‌రావును కలవడం ద్వారా ఈ సమస్య సగం పరిష్కరమైంది. ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. ఇప్పుడు మా గ్రామానికి ఎటువంటి అటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతున్నది. %--% లోయపల్లి శ్రీధర్‌రావు,గతంలో కరెంట్ ఎప్పుడు పోయేదో మాకు తెలిసేదికాదు. గిరాకీ టైంలో కరెంట్ పోవడంతో చికెన్ సెంటర్ వ్యాపారానికి ఇబ్బందులు పడ్డాం. ఇన్వర్టర్, బ్యాటరీలు తెచ్చుకున్నా దాని బ్యాకప్ సరిపోయేది కాదు. ఇప్పుడు కొత్త సబ్‌స్టేషన్ నుంచి నిమిషం కరెంట్ పోకుండా ఇస్తున్నారు. షాపులకు ఎటువంటి ఆటంకం లేకుండా కరెంట్‌ను ఇస్తున్నారు. ఇప్పుడు షాపులో బ్యాటరీలను వాడడం లేదు.

# ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన ఎర్రబంగారం



ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (మిర్చి) పోటెత్తింది. సుమారు 80వేల మిర్చి బస్తాలు అమ్మకానికి రాగా.. ఇంత భారీ మొత్తంలో మార్కెట్‌కు పంట రావడం ఈ సీజనలో ఇదే ప్రథమం. గతవారం 50వేల నుంచి 60వేల బస్తాల వరకు రాగా.. శుక్ర, శని, ఆదివారాలు వరుసగా మూడు రోజులు సెలవుల అనంతరం సోమవారం ఒక్కసారిగా 80వేల బస్తాలకు పైగా అమ్మకానికి వచ్చాయి. ఈ క్రమంలో బస్తాల దిగుమతికి మార్కెట్ యార్డుల్లో చోటు దొరక్కపోవడంతో రైతుల పంటను గేటు బయట రోడ్లపై దిగుమతి చేసి కొనుగోళ్ల నిర్వహించారు. కాగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కొంత కాలంగా తేజ మిర్చికి అత్యధిక ధరలు లభించడంతో ఉమ్మడిఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచే కాకుండా ఏపీలోని పలు జిల్లాల రైతులు కూడా ఖమ్మం మార్కెట్‌కు పంటను అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో తేజ రకం ఎండు మిరపకు క్వింటా రూ.23,500 జెండా పాట ధర నిర్ణయించగా డీలక్స్ క్వాలిటీ మిర్చిని జెండాపాట ధరకుకొన్న వ్యాపారులు మిగిలిన పంటను నాణ్యత మేరకు క్వింటా రూ.17,500 నుంచి రూ.21వేల వరకు కొనుగోలు చేశారు. తాలు మిర్చి క్వింటాల రూ.13వేల నుంచి రూ.14,500 వరకు కొనుగోలు చేశారు. అయితే గత గురువారం జెండాపాట రూ.23,700 పలకగా.. సోమవారం ఆ ధర రూ.200 తగ్గింది. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, కార్యదర్శి రుద్రాక్ష మల్లేశం, గ్రేడ్‌టూ కార్యదర్శి బజారు, తదితరులు పర్యవేక్షించారు.

# రైతుల అంగీకారం లేకుండా భూ సేకరణ చేయొద్దు




యాచారం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీలకు, ప్రజావసరాలకు అసైన్డ్, పట్టా భూములను రైతుల అంగీకారం లేకుండా తీసుకోవద్దని, విధిలేని పరిస్థితుల్లో భూసేకరణ చేయాల్సి వస్తే సదరు కంపెనీల్లో వచ్చేలాభాలను రైతులకు నిర్ణీత దమాషాలో పంపిణీ చేయాలని సుప్రీం కోర్టుసీనియర్ న్యాయవాది నిరూపరెడ్డి, కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి అన్నారు.యాచారంలో లీప్స్ సంస్థ ఆధ్వర్యంలో 'తెలంగాణ భూమి–కారవాన్' అంశంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఫార్మాసిటీకి అసైన్డ్/పట్టా భూములు తీసుకుంటున్న ప్రభుత్వం ఆ కంపెనీల్లో వచ్చే లాభాలను విధిగా రైతులకు కొంత వాటా ఇవ్వాలనే చట్టం ఉందన్నారు. ఏపీలో రాజధాని అమరావతి కోసం తీసుకున్న భూముల్లో రైతులకు ప్లాట్లు, ఫ్లాట్లలో అద్దె ఇచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. అయితే ప్రభుత్వ మార్పుతో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. అభివృద్ధిపేరుతో పేదల భూములను కంపెనీలకు కట్టబెట్టడం సరికాదన్నారు. ధరణి పాస్‌బుక్కులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాచారంలో మైనింగ్ జోన్, డంపింగ్ యార్డులకు అసైనీల భూములు తీసుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్ర క్షమించరానిదన్నారు. పేద రైతులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రిటైర్డ్ జడ్జిలు ముందుకు రావాలని జర్నలిస్ట్ పాశం యాదగిరి చెప్పారు. రైతులకు అన్యాయం చేసే ఏ ప్రభుత్వమూ మనుగడ సాధించదన్నారు. సదస్సులో కాంగ్రెస్ నాయకులు నిరంజన్‌రెడ్డి, తాడిపర్తి సర్పంచ్ రమేష్, టీజేఎస్ నాయకుడు నిరంజన్, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శివగూడ వాసులకు తీరిన తాగునీటి గోస



కెరమెరి : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని శివగూడ. 13 కుటుంబాలు ఉండగా.. 50 మందికిపైగా జనాభా ఉంటారు. జోడేఘాట్ పోరాటంలోని 12 గ్రామాల్లో ఇది ఒకటి. మండల కేంద్రం నుంచి 12 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ గ్రామస్తులకు ఎండాకాలం వచ్చిందంటే గొంతు తడుపుకోవడానికి కూడా చుక్కా నీరు దొరకకపోయేది. సమైక్య పాలకుల పట్టింపులేని తనంతో నీటికి అవస్థలు పడేవారు. గూడెంలోని కొలాం గిరిజనులు రెండు గుట్టలు దిగి లోయలో ఉన్న ఆసిఫాబాద్ మండలంలోని గోగిన్ మోవడ్ వాగును ఆశ్రయించేవారు. బిందెడు నీటి కోసం చిన్నాపెద్దా అనే తేడాలేకుండా సుమారు రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకునే వారు. నడవడానికి సైతం సరైన మార్గం లేనప్పటికీ, గత్యంతరం లేక రాళ్లు రప్పల మధ్య బిందెలు మోస్తూ నీటిని తెచ్చుకునే వారు. ఎత్తయిన గుట్టల పక్కన పెద్దలోయ ఏ మాత్రం అదుపు తప్పినా ప్రాణానికే ప్రమాదం. అయినా సాహసోపేతంగా వెళ్తూ స్నానాలు చేసి, బట్టలు అక్కడే శుభ్రం చేసుకొని బిందెలతో నీటిని తెచ్చుకునే వారు. మధ్య మధ్యలో కొద్ది సేపు సేదతీరి ఇంటికచ్చే వారు.

దశాబ్దాలుగా కష్టాల మధ్య జీవిస్తున్న వారికి తెలంగాణ సర్కారు భగీరథ నీళ్ల అందించింది. ఇంటింటికీ నల్లా బిగించి నీరు అందిస్తున్నది. మూడేండ్ల నుంచి శుద్ధజలం తాగుతూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. ప్రజలతోపాటు జీవరాసులు కూడా మిషన్ భగీరథ నీటిని తాగుతున్నాయి. కేసీఆర్ సార్ వల్లే మాకు నీటి సమస్య దూరమైంది. ఇంటి గుమ్మంలోనే నల్లా పెట్టారు. గతంలో మా కష్టాలను ఏ సర్కారు పట్టించుకోలేదు. తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎన్నో సార్లు నాయకులకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకో లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొంత కాలం ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశా రు. అనంతరం మిషన్ భగీరథ పథకం వచ్చా క గ్రామానికి పైపులైన్ వేసి నల్లాలు బిగించా రు. కేసీఆర్ సార్ చేసిన మేలు ఎప్పటికీ మరువం. – మారుబాయి, శివగూడ(కెరమెరి)తలుచుకుంటేనే దుఃఖమస్తది.. ఆ నాటి నీళ్ల బాధలు తలుచుకుంటే దుఃఖమస్తది. ఎండల్లో బోర్ పని చేయకుంటే చెలిమే నీళ్లు తెచ్చుకొని తాగినం. అది కూడా అందుబాటులో దొరికేది కాదు. 2,3 కోస్ల దూరం వెళ్తేగాని నీళ్లు దొరకని పరిస్థితి. ఒక్క బిందే నీళ్లు తెచ్చుకోడానికి రెండు గుట్టలు దిగి చెలిమే నుంచి నీళ్లు పట్టుకొని మోసుకొచ్చేటోళ్లం. ఈ బాధలు తట్టుకోలేక అక్కడే స్నానాలు చేసి బట్టలు పిండుకొని నీళ్లబిం దెతో వచ్చే సంఘటన గుర్తు చేస్తేనే కళ్ల నుంచి నీళ్లు వస్తాయి. మాకు స్వరాష్ట్రంలో సౌకర్యాలు కలిగాయి. నీళ్ల బాధ తీర్చిన ఈ సర్కార్‌కు, సీఎం సార్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

# వానకాలం పంటలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్న వ్యవసాయ శాఖ



కుమ్రం భీం ఆసిఫాబాద : వానకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న అధికారులు పంటల సాగు, దిగుబడుల వివరాలతో పాటు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 4.60 లక్షల ఎకరాల్లో పంటలు సాగవనున్నట్లు అధికారులు అంచనాలు తయారు చేశారు. అత్యధికంగా 3,37,374 ఎకరాల్లో పత్తి, 58 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇక కంది 44వేల ఎకరాలు, పెసర 2,948 ఎకరాలు, మినుములు 437 ఎకరాలు, సో యాబీన్ 1754 ఎకరాలు, ఇతర పంటలు 9009 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఇవేగాకుండా చిరుధాన్యాలను సాగు చేసేందుకు కూడా అధికారులు ప్రణాళికలు రూపొందించా రు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు చిరుధాన్యాలను జిల్లాలోనే ఉత్పత్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భా గంగా రాగి 400ఎకరాలు, కొర్రలు 2600ఎకరాలు, సజ్జలు 800 ఎకరాలు, సామలు 1800 ఎకరాలు, ఊదలు 1080 ఎకరాల్లో సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వానకాలంలో విత్తనాల కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న పత్తికి 13,883 విత్తనాల ప్యాకెట్లు, వరికి 76,474 క్వింటాళ్లు, కంది విత్తనాలు 1788.88 క్వింటాళ్లు, పెసర 117.92 క్వింటాళ్లు, మినుములు విత్తనాలు 21.85 క్వింటాళ్లు, సోయాబీన్ 526.2 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు వానకాలంలో రైతులు పంటలు వేసేనాటికి విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే చిరుధాన్యాల సాగుకోసం మొత్తం 149.60 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో సాగు చేయనున్న పంటలకు అవసరమైన ఎరువులను తెప్పించేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

# కలిసి మాత్రమే అడుగులు


హైదరాబాద్, : తెలంగాణ కాంగ్రెస్‌లో .. కోదండరాంపార్టీ తెలంగాణ జన సమితి విలీనం అవుతందని కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై కోదండరాం స్పందించారు. హైదరాబాద్‌లో జూపల్లి కృష్ణారావుతో సమావేశం అయ్యారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన .. కేసీఆర్ ను ఓడించడానికి కలిసి పని చేస్తాం కానీ.. విలీనం ప్రస్తావన అసలు లేదని స్పష్టం చేసారు. రాష్ట్రంలో ఉన్న నిరంకుశ పాలనను అంతమొందించి ఒక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం అందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని.. అలాంటి ఐక్యతను సాధించే లక్ష్యంతో తప్పకుండా పనిచేస్తామని అన్నారు. అయితే విలీనం అనే ప్రసక్తే రాదన్నారు. టీజేఎస్‌ను విలీనం చేయాలన్న ప్రతిపాదనతో తనను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ కలిసారనే వార్తల్లో వాస్తవం లేదని.. అసలు చర్చలే జరగలేదని కోదండరామ్ స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు కలవాల్సిన అవసరం ఉందని, ఇక్కడ కేసీఆర్‌కు వ్యతిరేకంగా కాదని, ఒక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేరడంలేదని, నిరంకుశత్వం కొనసాగుతోందని.. దాన్ని అంతమొందిచడానికి అన్ని పార్టీలు కలిసి రావాల్సిన అవసరం ఉందని, రాబోయే ఎన్నికలపై రాష్ట్ర కమిటీ మీటింగ్‌లో చర్చలు జరిపి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో ప్రజాస్వామిక పాలన రావాలని, దాని కోసం మహాకూటమిగా ఏర్పాడాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ చైర్మన్ గా కీలక పాత్ర పోషించిన కోదండరాం.. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరలేదు. తెలంగాణ జన సమితి పేరుతో సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ పార్టీలతో కూడిన మహాకూటమిలో కలిసి పని చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలవద్దనే ఉద్దేశ్యంతో కూడా మహాకూటమిలో టీజేఎస్ చేరింది. అయితే అనుకూల ఫలితాలు రాలేదు. ఉద్యమ నేత రాజకీయ పార్టీ పెట్టినందున ప్రజల్లో అంచనాలు ఉన్నా? పార్టీ ఊహించిన స్థాయిలో బలోపేతం కాలేదు. ముదస్తు ఎన్నికల్లో సరైన ఫలితాలు రాకపోవడంతో కొంత మంది పార్టీని వీడి వెళ్లిపోయారు. ఆ తర్వాత పార్టీ నిర్మాణంపై దృష్టి సారించలేకపోయారు. ఆర్ఎస్ పాలనపై పూర్తి వ్యతిరేకంగా ఉన్న కోదండరాం ఎలాగైనా కేసీఆర్ గద్దె దిగాలని చూస్తున్నారు. కానీ, కోదండరాం ఒక్కరితో అది అయ్యే పనికాదు. ఒక ప్రొఫెసర్ గా? ఉద్యమ సారథిగా ఆయనకు తెలంగాణ పరిస్థితిపై పూర్తి అవగాహన ఉన్నందున కోదండరాంను కలుపుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. కారణం ఏదైనా కోదండరాం ఇటీవల అంత చురుగ్గా లేరు.కానీ ఆయనకు కొంత ఇమేజ్ ఉంది. ఉద్యమకారునిగా ఆయన ఇమేజ్ పార్టీకి పనికి వస్తుందన్న ఉద్దేశంతో.. కాంగ్రెస్ పార్టీ విలీనానికి ప్రతిపాదిస్తోంది. కానీ కలిసి పని చేయడానికి సిద్ధమే కానీ.. విలీనానికి అంగీకరించేది లేదని ప్రొఫెసర్ చెబుతున్నారు.

# లక్షలు వెచ్చిస్తున్నా ఉపయోగం లేదు



కరీంనగర్ : స్మార్ట్‌సిటీలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, ఓపెన్ జిమ్స్, పార్కుల నిర్మాణం చేపడుతున్నారు. జనం తక్కువగా ఉండే ప్రాంతాలు, పాదచారులు నడువని ఎల్ఎండీ ఆనకట్ట సమీపంలోని బైపాస్ రోడ్డు వంటి ప్రాంతాల్లో కూడా ఫుట్‌పాత్‌లు, రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఇటీవల నగరంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ బస్‌బేలు, స్మార్ట్ బస్‌షెల్టర్లను చూసి ఎవరి కోసం వీటిని ఏర్పాటు చేస్తున్నారని జనం ప్రశిస్తున్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న కరీంనగర్ నలుదిశలా విస్తరించడమే కాకుండా నగరంలో రద్దీ అనూహ్యంగా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరపాలక సంస్థ సౌకర్యాలను కల్పించేందుకు కృషిచేస్తోంది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలోని ప్రధాన రహదారుల్లో ఆకర్షణీయమైన బస్‌షెల్టర్లు, బస్‌బేలను ఏర్పాటు చేస్తున్నారు. వీటి వద్ద ఏర్పాటు చేసే అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డుల ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అయితే లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేస్తున్న బస్‌షెల్టర్లతో ఎంత మేరకు ప్రజలకు ఉపయోగం ఉంటుందని నగరపాలక సంస్థ అధికారులు ఆలోచించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రజల అవసరాలే ప్రధానంగా ఆలోచించి డీపీఆర్‌ను సిద్ధం చేసుకొని ఆ మేరకు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం నగరంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు, బస్‌బేలు ఉపయోగపడటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండి బస్సుల కోసం, ప్రైవేటు వాహనాల కోసం, ఇతరత్రా అవసరాల కోసం వేచిచూసే ప్రయాణికులు, ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాకాకుండా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు, ఆటోల కోసం వేచి చూసే ప్రాంతాల్లో కాకుండా జనం ఉండని ప్రాంతాల్లో బస్‌షెల్టర్లను, బస్‌బేలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో ప్రజలకు ఎలా మేలు జరుగుతుందో అధికారులకే తెలియాలి. ప్రతి రోజు కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, దినసరి కార్మికులు, ప్రైవేట్ ఉద్యోగులు బస్సుల్లో, ఆటోల్లో, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లి వచ్చే వారి కోసం బస్‌షెల్టర్లు, బస్ బేలు ఉపయోగపడాలి. ప్రస్తుతం కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు అసాంఘిక చర్యలకు, రాత్రి వేళల్లో కుక్కలు, పందులు, పశువులు, మద్యం మత్తులో రోడ్డుపై నిద్రించే వారికి అడ్డాలుగా మారాయి. మరోవైపు బస్సులు, ఆటోలు, ప్రైవేట్ వాహనాల కోసం వేచి చూసే ప్రయాణికులు ఉండే ప్రాంతాల్లో బస్‌షెల్టర్ లేక పోవడంతో రోడ్డు పక్కన ఎండలో నిలుచొని ఇబ్బందులు పడుతున్నారు.

# జోరుగా గుట్కాదందా



సిద్దిపేట : సిద్దిపేట జిల్లాలో గుట్కాదందా జోరుగా కొనసాగుతున్నది. ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తూ కొందరు వ్యాపారులు రూ.కోట్లు సంపాదిస్తున్నారు. పక్కరాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుని కిరాణాషాపులకు, పాన్‌డబ్బాలకు రహస్యంగా పంపిణీ చేస్తున్నారు. అయినా కూడా సంబంధిత అధికారులు దాడులు చేయకుండా నిమ్మకుండి పోతున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల పట్టణాల్లో నిషేధిత గుట్కా ప్యాకెట్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కొంత మంది బడా వ్యాపారులు అర్ధరాత్రిళ్లు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి గుట్కా ప్యాకెట్లను తీసుకొచ్చివారికి సంబంధించిన రహస్య గోదాముల్లో నిల్వ ఉంచుతున్నారు. అక్కడి నుంచి జహీరాబాద్, ఝరాసంగం, రాయికోడ్ బొడుమట్‌పల్లి, మెదక్, రామాయంపేట మీదుగా సిద్దిపేటకు తీసుకొస్తున్నారు. ఉదయంవేళ ద్విచక్ర వాహనాలపై కిరాణా షాపులకు, పాన్ డబ్బాలకు తరలిస్తున్నారు. సిద్దిపేట పట్టణంలో కిరాణాషాపులు, పాన్ డబ్బాలు అన్ని కలిపి సుమారు 2వేల వరకు ఉంటాయి. హుస్నాబాద్, గజ్వే ల్, దుబ్బాక పట్టణాల్లో సుమారుగా 3వేల వరకు షాపులు ఉన్నాయి. పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసిన గుట్కా, అంబర్ ప్యాకెట్లను ప్రతిదుకాణానికి రెండు రోజులకు ఒకసారి రూ.500 విలువ చేసే ప్యాకెట్లను అందజేస్తున్నారు. ఈ లెక్కన రెండురోజులకు ఒకసారి సుమారుగా రూ.25లక్షల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, గల్లీల్లోని దుకాణాల్లో అమ్మకాలను చూస్తే నెలకు సుమారుగా రూ.5 కోట్ల వరకు గుట్కా వ్యాపారం సాగుతున్నది. సిద్దిపేట జిల్లా కేంద్రంగా గుట్కాదందా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎప్పుడైనా దొరికితే చిన్నచిన్న కిరాణాషాపుల వ్యాపారులపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. కానీ పక్కరాష్ట్రాల నుంచి దిగుమతి చేస్తూ గుట్కా దందాపై రూ.లక్షలు, కోట్లు సంపాదించే వారిపై పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. 2022లో జోరుగా గుట్కాదందా సాగినప్పటికీ పోలీసులు నమోదు చేసిన కేసులు ఐదులోపే ఉన్నాయి. పోలీసుల నిఘా లేకపోవడం వల్లనే విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. నిషేధిత గుట్కాకు అలవాటుపడిన యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ తరహా దందాపై పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకొని గుట్కా అమ్మకాలను నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

# నత్తనడకన మార్కెట్ నిర్మాణం



సంగారెడ్డి : సంగారెడ్డిలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ సముదాయం పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొనుగోలుదారులు, వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా.. ఒకచోట అన్నిరకాల వెజ్, నాన్‌వెజ్, పూలు, పండ్లు తదితరాలు విక్రయించేలా జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.6.70 కోట్లు మంజూరు చేసింది. పట్టణంలోని బైపాస్ రోడ్డు మలుపు వద్ద పాత గృహనిర్మితి కేంద్రం ఆవరణలో రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. మొత్తం 60 వెజ్, 26 నాన్‌వెజ్, పూలు 18, పండ్ల కోసం మొత్తం 104 దుకాణాలను నిర్మించాలని నిర్ణయించారు. నిర్మాణ పనులను 2021 డిసెంబరు 16న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. మార్కెట్‌ను ఏడాదిలోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అప్పట్లో మంత్రి కేటీఆర్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఏడాది గడిచినా పనులు కేవలం పునాదులు, ఫిల్లర్ల స్థాయిలనే ఉన్నాయి. నిర్మాణ సామగ్రి కూడా నాసిరకమైనది వాడుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. నాణ్యత లేని స్టీల్, సిమెంట్, ఇసుకకు బదులు రాతిపొడి(డస్ట్)ని వాడుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడుతున్నారు. సంగారెడ్డి పట్టణంలో సమీకృత మార్కెట్ సముదాయం పనులు పూర్తయితే అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. పట్టణంలో లక్షకు పైగా జనాభా ఉన్నారు. వీరితోపాటు చుట్టుపక్కల గ్రామాలైన అంగడిపేట, తాళ్లపల్లి, కులబ్‌గూర్, ఫసల్‌వాది, కంది, మల్కాపూర్, ఇరిగిపల్లి తదితర గ్రామాల ప్రజలు కూరగాయలు, పండ్లు, పూలను కొనడానికి సంగారెడ్డికే వస్తుంటారు. ఆది, సోమ, గురు, శుక్రవారాల్లో పట్టణంలో సంతలు జరుగుతాయి. ఈ సమయంలో పాత బస్టాండ్, కలెక్టరేట్, పోతిరెడ్డిపల్లి, బైపాసరోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నది. సమీకృత మార్కెట్ సముదాయం నిర్మాణం పూర్తయితే మాంసం, కూరగాయలు, పూలు, పండ్ల విక్రయాలు ఒకేచోట జరగడంతో ఇబ్బందులు తీరుతాయి. అందుకే అధికారులు స్పందించి మార్కెట్ సముదాయ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

# రైతుల ఆనందం కోసమే సంబురాలు



రాజోలి, : రైతుల ఆనందం కోసమే రైతు సంబురాలు నిర్వహిస్తున్నట్లు అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో లక్ష్మీ మాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఎద్దుల బలప్రదర్శన పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి ఉచిత కరెంట్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ ఆయకట్టుదారుల సంఘం మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి, వడ్డేపల్లి జడ్పీటీసీ సభ్యుడు రాజు, సర్పంచు సవారి, ఎంపీటీసీ సభ్యుడు మన్సూర్, అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం పిలుపునిచ్చారు. అయిజలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన భూమిపూజ చేశారు. మునిసిపాలిటీ పరిధిలో నాయిబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాలు, రైతు సంఘం భవనం, ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం పాతబస్టాండు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సాగిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ పార్టీ ముందుకు వెళ్తోందని, మరోమారు ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోతుల జనార్దన్‌రెడ్డి, రాముడు, శ్రీదర్, నాగిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఆంజనేయులు, కాశపోగురాజు, మల్లికార్జున్, నరేంద్రవర్మ, కౌన్సిలర్‌లు సీఎం సురేష్, నర్సింహులు, సువర్ణ, రాణి పాల్గొన్నారు.

# ప్రయోగాలు చేసేదెలా?

## - రెండేళ్ళుగా నిధులు రాక ఇబ్బంది



అయిజ, : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతులు కరువయ్యాయి. అరకొర సదుపాయా లతో నెట్టుకురాలేక అధ్యాపకులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లోని ప్రయోగ శాలలు పనికిరాకుండా పోయాయి. పూర్తి స్థాయిలో పరికరాలు లేకపోవడం సమస్యగా మారింది. ఉన్నవి కూడా దుమ్ము పట్టి వృథాగా మారాయి. దీంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రయోగాలు ఎలా చేయించాలో అర్థం కాక అధ్యాపకులు అవస్థలు పడుతున్నారు. రసాయనాలు అయిపోయాయి. ఇంటర్ బోర్డు నుంచి నిధులు వస్తే తప్ప నూతన పరికరాలు కొనే పరిస్థితి లేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఆరు కస్తూర్బాలు ఉన్నాయి. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 13 ఉన్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 3,444 మంది జనరల్, 694 మంది ఒకేషనల్ కోర్సు చదువుకుంటున్నారు. ద్వితీయ సంవత్సరంలో 3,233 మంది జనరల్, 589 మంది ఒకేషనల్ విద్యార్థులున్నారు. కరోనా కారణంగా రెండు సంవత్సరాలు ప్రయోగ పరీక్షలు నిర్వహించలేదు. ఈ విద్యా సంవత్సరంలో పూర్థి స్థాయి సిలబస్‌తో ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఇంటర్ బోర్డు ఆదేశించింది. దీంతో అధ్యాపకులు రెండేళ్లుగా మూలనపడ్డ ప్రయోగ వస్తువులు, పరికరాల దుమ్ము దులిపే పనిలో నిమగ్నమయ్యారు. భౌతిక శాస్త్ర ప్రయోగ పరికరాలు, రసాయన శాస్త్రం ప్రయోగాల్లో వాడే రసాయనాలు, జంతు, వృక్ష శాస్త్రాల ప్రయోగాల్లో వాడే వస్తు పరికరాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీటిని కొనుగోలు చేయటానికి దాదాపు రూ.50.000 నుంచి రూ.80,000 వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని అధ్యాపకులు తెలుపుతున్నారు. ఈ నిధులను ఇంటర్ బోర్డు కళాశాలలకు విడుదల చేసిన తర్వాతనే వాటిని కొనుగోలు చేసేందుకు అధ్యాపకులు చొరవ చూపుతున్నారు. ఇప్పటి వరకు బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదనే అంటున్నారు. ఈ తతంగం అంతా పూర్తయ్యేందుకు దాదాపు 15 నుంచి 25 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి 15 నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహిం చేందుకు ఇంటర్ బోర్డు టైం టేబుల్‌ను విడుదల చేసింది. ఆలోగా ప్రభుత్వం స్పందించి ప్రయోగ శాలలకు అవసరమైన నిధులు విడుదల చేయాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయోగ పరీక్షల నిర్వహణ కష్టసాధ్యం. ఇప్పటి వరకు నిధులు రాలేదు. మారిన సిలబస్‌కు అనుగుణంగా ప్రయోగాలు చేయించాల్సి ఉంటుంది. రసాయనాలు అయిపోయాయి. వస్తువులు, పరికరాలు పగిలిపోయాయి. మరి కొన్ని పనికి రాకుండా ఉన్నాయి. ప్రయోగాలకు సంబంధించిన పరికరాల కొనుగోలుకు వెంటనే నిధులు విడుదల చేయాలి.

# పారిశుధ్య కార్మికుల నియామకాల్లో ఇష్టారాజ్యం!



భువనగిరి : మెరుగైన పారిశుధ్య సేవలు అందించే పేరిట భువనగిరి మునిసిపాలిటీలో అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల నియామకాలు వివాదాస్పదం అవుతున్నాయి. పెరిగిన పట్టణ విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగాపారిశుధ్య కార్మికుల నియామకాలకు సీడీఎంఏ ఇచ్చిన అనుమతి మేరకు చేపట్టిన నియామకాలు అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాయి. 28మంది కార్మికుల నియామకాలకు 189 మంది దరఖాస్తులు చేసుకోగా ఎంపికైన 28మంది కార్మికులు సంక్రాంతి రోజున విధుల్లో చేరారు. అయితే ఆ 28 మందిలో 111మంది విలీన గ్రామమైన రాయగిరికి చెందినవారే కావడం గమనార్హం. పైగా వారిలో ఆరుగురు వైస్ చైర్మెన సమీప బంధువులని ప్రచారమవుతోంది. నియామకాలన్నీ నల్లగొండకు చెందిన ఓ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా జరగడం, ఈ కార్మికులు నిర్వహించే పారిశుధ్య పనులను రెండు శాతం సర్వీస్ ట్యాక్సీతో ఆ ఏజెన్సీకి అప్పగించడం మరింత ఆశ్చర్యపరుస్తోంది. నియామకాలపై దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని పలువురు దరఖాస్తుదారులు మంగళవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట దర్నా చేశారు. 28 మంది పారిశుధ్య కార్మికుల నియామకాల ప్రక్రియ నోటిఫికేషన జారీ అయినప్పటి నుంచే వివాదాస్పదమైంది. తొలుతగా మునిసిపల్ అధికారులే దరఖాస్తుల స్వీకరణ చేపట్టడంతో కొద్ది మంది కౌన్సిలర్లు ఆశావాహుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులను వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. దీంతో ఆ బాధ్యతను జిల్లా ఉపాధి కల్పనాధికారికి అప్పగించారు. ఈ మేరకు 189 మంది ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే నియామకాల ప్రక్రియను మునిసిపాలిటీనే చేపడుతుందని పేర్కొన్న అధికారులు నియామకాల డాక్యుమెంటేషన సాకు చూపుతూ నిబంధనలను పేర్కొంటూ ఉద్దేశపూర్వకంగా నల్లగొండలోని ఏజెన్సీకి నియామకాలను, రెండు శాతం సర్వీస్ చార్జీతో ఆ 28 మంది కార్మికుల పారిశుధ్య పనుల ఏజెన్సీకి కూడా అప్పగించారు. దీంతో నియామకాల ప్రక్రియ అంతా పాలకపక్షానికి అనుకూలంగానే జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నోటిఫికేషన నిబంధనల మేరకు 28 పోస్టులకుగాను వివిధ ప్రాంతాలకు చెందిన 189 మంది దరఖాస్తు చేసుకోగా మునిసిపల్ ముఖ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒకే ప్రాంతానికి చెందిన 11 మంది సమీప బంధువులతో పాటు టీఆర్ఎస్ కౌన్సిలర్లు సిఫార్సు చేసినట్టు ప్రచారమవుతున్న మరో 10 మందికే ఉద్యోగాలు రావడంతో నియామకాల ప్రక్రియ అంతా ఏకపక్షంగా జరిగిందని ప్రచార మవుతోంది. ఔట్ సోర్సింగ్ పారిశుధ్యకార్మికుల విధులు, వేతనాల చెల్లింపును మెప్మా పర్యవేక్షించాల్సి ఉండగా అందుకు భిన్నంగా ఓ ప్రైవేటు ఏజెన్సీకి కట్టబెట్టడంపె పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్వీసులో మరణించిన 13 మంది ఎనఎంఆర్ పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు, నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని మొదటి నుంచి విపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను అధికారులు బేఖాతర్ చేయడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా సాగిన 28 మంది ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల నియామకాలను రద్దు చేయాలి. ఎనఎంఆర్ కార్మికులుగా దశాబ్దాల పాటు సేవలందిస్తూ సర్వీసులోనే మృతిచెందిన 13 మంది కార్మికుల కుటుంబాలకు అవకాశాలు ఇవ్వాలని కోరినప్పటికి అధికారులు స్పందించలేదు. నియామకాలను, పనులను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడం నిబందనలకు విరుద్ధం. విలీన గ్రామమైన రాయిగిరికే చైర్మన, వైస్ చైర్మన పదవులు దక్కడంతో అధిక నిధులు కేటాయించుకుంటున్నారు.

# భారత్‌తో మూడు యుద్ధాల తర్వాత బుద్ధొచ్చింది : పాక్



ఇస్లామాబాద్ : భారత దేశంతో మూడు యుద్ధాలు చేసిన తర్వాత తమకు బుద్ధి వచ్చిందని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ చెప్పారు. కశ్మీరు వంటి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుని, ఇరు దేశాలు శాంతియుతంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. దుబాయ్‌లోని ఓ అరబిక్ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంట ర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక, ఆహార సంక్షోభంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి షరీఫ్ ఇచ్చిన సందేశంలో, కశ్మీరులో జరుగుతున్నదానిని ఆపాలన్నారు. కశ్మీరులో మానవ హక్కుల ఉల్లంఘున జరుగుతోందన్నారు. పొరుగు దేశంతో శాంతిని కోరుకుంటు న్నామన్నారు. ''మనకు ఇంజినీర్లు, డాక్టర్లు, నిపుణులైన కార్మికులు ఉన్నారు. ఇరు దేశాలు అభివృద్ధి చెందేవిధంగా ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు, సౌభాగ్యం కోసం ఈ ఆస్తులను ఉపయోగించుకోవాల నుకుంటున్నాం. శాంతియుతంగా జీవిస్తూ, అభివృద్ధి సాధించాలా? లేదంటే పరస్పరం కొట్లాడుకుంటూ వనరులను, సమయాన్ని వృథా చేసుకోవడమా? అనేది మనమే తేల్చుకోవాలి" అని చెప్పారు. భారత దేశంతో మూడు యుద్ధాలు చేశామని, వాటి వల్ల ప్రజలకు మరింత దుఃఖం, పేదరికం, నిరుద్యోగం వచ్చాయని అన్నారు. తాము గుణపాఠం నేర్చుకున్నామని, అయితే వాస్తవ సమస్యలను మనం పరిష్కరించుకోగలిగితే,శాంతియుతంగా జీవించాలని కోరుకుంటున్నామన్నారు. బాంబులు,ఆయుధాల కోసం వనరులను వృథా చేయాలని తాము కోరుకోవడం లేదన్నారు. ఇరు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలవేనని, యుద్ధం జరిగితే, ఏం జరిగిందో చెప్పడానికి ఎవరు మిగులుతారని ప్రశ్నించారు. ''భారత దేశ నాయకత్వానికి, ప్రధాన మంత్రి మోదీకి నా సందేశంఏమిటంటే, మనం ఓ చోట కూర్చుందాం. కశ్మీరు వంటి సలసల కాగుతున్న అంశాల పరిష్కారానికి నిజాయితీగా, శ్రద్ధగా చర్చించుకుందాం. శాంతియుతంగా జీవిస్తూ, అభివృద్ధి సాధించ డమా? లేదంటే ఒకరితో మరొకరం పోట్లాడుకుంటూ వనరులను, సమయాన్ని వృథా చేసుకోవడమా? అనేది మనమే తేల్చుకోవాలి" అని షరీఫ్ అన్నారు.

# తక్కువ సోడియం ఆహారం ఎవరికి అనుకూలం..?

గుండె వైఫల్యంతో సహా గుండె జబ్బులు ఉన్నవారికి మాత్రమే వైద్యులు తక్కువ సోడియం ఆహారాన్ని సిఫార్సు చేస్తుంటారు. గుండె సమస్య తలెత్తినప్పుడు కిడ్నీ పనితీరు కూడా క్షీణిస్తుంది. సోడియం, నీరు నిలుపుదలకి దారితీస్తుంది. ఐతే సోడియం శరీరానికి కీలకమైన ఖనిజం కాబట్టి డాక్టర్ సిఫార్సుపై మాత్రమే తక్కువ సోడియం ఆహారాన్ని తీసుకోవడం మంచిది. తక్కువ సోడియం ఆహారం అంటే... సోడియం తీసుకోవడం కనిష్టంగా ఉంచడం. ఇది సహజ ఆహారాల ద్వారా మాత్రమే ఈ ఖనిజాన్ని పొందడానికి వీలవుతుంది. కొంతమంది వ్యక్తులలో, తక్కువ సోడియం ఆహారం గుండె వైఫల్య ప్రమాదాన్ని తగ్గిస్తుంది. తదుపరి హృదయ సమస్యలను నివారిస్తుంది. అయినప్పటికీ, తక్కువ సోడియం ఆహారంలో హైపోనాట్రేమియా, పేలవమైన కొలెస్ట్రాల్ స్థాయిలు, గుండె వైఫల్యం వంటి అనేక ప్రతికూలతలు కూడా ఉన్నాయి. అదనంగా, శరీరం యొక్క సరైన ద్రవ సమతుల్యత, సరైన మూత్రపిండాల పనితీరు కోసం సోడియం కీలకం. అందువల్ల, తక్కువ సోడియం ఆహారం అవసరమా లేదా అనేది తెలుసుకోవడం చాలా ముఖ్యం. తక్కువ సోడియం ఆహారం కొంతమంది ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని అనేక అధ్యయనాలు చూపిస్తున్నాయి. కానీ తక్కువ ఉప్పు ఆహారం వైపు చూస్తున్నట్లయితే ఇది సురక్షితంగా ఉంటుంది. టేబుల్ ఉప్పు సోడియం యొక్క ముఖ్యమైన మూలం. ప్రతి రోజు, సగటు వ్యక్తి ఐదు లేదా అంతకంటే ఎక్కువ టీస్పూన్ల ఉప్పును తీసుకుంటాడు. శరీరానికి ప్రతిరోజూ పావు టీస్పూన్ ఉప్పు మాత్రమే అవసరం కాబట్టి ఇది శరీరానికి అవసరమైన



దానికంటే దాదాపు 20 రెట్లు ఎక్కువ. సోడియం, సాధారణంగా ఆరోగ్యానికి హానికరం కాదు. అయినప్పటికీ, ఫాస్ట్ ఫుడ్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్ లేదా ఇతర జంక్ ఫుడ్స్‌లో అధికంగా ఉండటం వల్ల దీనికి చెడ్డ పేరు వస్తుంది. అధిక సోడియం వినియోగాన్ని నివారించడానికి ఉత్తమ మార్గం ఫాస్ట్ ఫుడ్స్ తినడం మానేయడం. ప్రాసెస్ చేసిన ఆహారాలను వీలైనంత వరకు పరిమితం చేయడం. క్యాన్డ్, ప్రాసెస్డ్ లేదా రెడీమేడ్ ఫుడ్స్‌లో అదనపు ఉప్పు ఉంటుంది. మీరు మీ భోజనానికి అదనపు ఉప్పును జోడించవద్దని నిర్ధారించుకోండి. చిప్స్ లేదా ఇతర సాల్టెడ్ స్నాక్స్ తినడాన్ని పరిమితం చేయండి. పండ్లు, కూరగాయలలో ఇప్పటికే కొంత మొత్తంలో సోడియం ఉంటుంది. సహజ ఆహారాలను మాత్రమే తింటున్నట్లయితే మీకు లభించే ఏకైక ఉప్పు సహజ సోడియం, ఇది మీ శరీరం సరిగ్గా పనిచేయడానికి కీలకమైనది.

# చనుపాలలో మైక్రోప్లాస్టిక్స్ గుర్తింపు..

నవజాత శిశువుకు తల్లి చనుపాలే స్వచ్ఛమైన, రుచికరమైన అమృతాహారమని మనకు తెలుసు. కాలుష్యం, రసాయనాల పట్ల పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలి. అలాంటి స్వచ్ఛమైన తల్లి చనుపాలలో ప్రమాదకర మైక్రోప్లాస్టిక్స్ (5 మిల్లీమీటర్ల కన్న తక్కువ పరిమాణం) అవశేషాలు నిర్ధారణ అయ్యాయని తొలిసారిగా తాజా 'జర్నల్ పాలిమర్' పరిశోధనా గ్రంథంలో అచ్చయిన వ్యాసం వెల్లడించింది. ఈ ప్లాస్టిక్ అవశేషాల దుష్ప్రభావం శిశువులు, తల్లులపై ఏమేరకు ఉండవచ్చనే పూర్తి వివరాలను విశ్లేషించాల్సి ఉన్నప్పటికీ దీని ప్రభావం లేలేత శరీరాలపై పడడం తప్పదని వ్యాసకర్తలు తెలియజేస్తున్నారు. గర్భవతిగా, శిశు జననానంతరం తల్లిలో కలుషిత మైక్రోప్లాస్టిక్ పరిమాణాన్ని తగ్గించడానికి మార్గాలను నిర్ధారించాల్సి ఉంది. తల్లి పాలు చేసే మేలుతో పోల్చితే కలుషిత మైక్రోప్లాస్టిక్స్ దుష్ప్రభావం తక్కువగానే ఉండవచ్చని, అయినప్పటికీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

**పరిశోధనా ఫలితాలు :** రోమ్ నగరంలో 34 మంది తల్లుల చనుబాలను సేకరించి విశ్లేషించిన శాస్త్రవేత్తల బృందం 26 మంది తల్లుల చనుపాలలో (ప్రసవించిన మొదటి వారంలో), అనగా 76 శాతం మాతృమూర్తుల చనుపాలలో మైక్రోప్లాస్టిక్స్ కనుగొన్నారు. తల్లులు తీసుకునే ఆహారం, తాగే శీతల పానీయాలు, పండ్ల రసాల్లోనే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ కాలుష్యం కారణంగా మైక్రోప్లాస్టిక్స్ శరీరంలోకి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. గతంలో మానవ గర్భస్థ మావి (హ్యూమన్ ప్లాసెంటా), మానవ రక్తం, ఆవు పాలలో కూడా మైక్రోప్లాస్టిక్స్ 80 శాతం వరకు ఉన్నాయని కనుగొన్నారు. పిల్లలకు పాలు తాగించే ప్లాస్టిక్ బాటిల్స్ ద్వారా పిల్లల్లో కూడా మైక్రోప్లాస్టిక్స్ చేరవచ్చని తెలుస్తున్నది. పాలిథీన్, పాలీప్రొపిలీన్, పివిసి ప్లాస్టిక్స్ ద్వారా ఉద్భవించే మైక్రోప్లాస్టిక్స్ అవశేషాలు మానవ శరీరంలోకి ప్యాకేజ్ రూపంలో చేరవచ్చని తెలుస్తున్నది. చనుపాలలో 2 మైక్రోన్స్ పరిమాణం కన్న ఎక్కువ పరిమాణం ఉన్న మైక్రోప్లాస్టిక్స్‌ను మాత్రమే పరిశోధనలోకి తీసుకున్నారని (తక్కువగా ఉన్న మైక్రోప్లాస్టిక్ అవశేషాలను విశ్లేషించడం జరుగలేదని) గమనించాలి.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :** మైక్రోప్లాస్టిక్స్ ప్రభావాన్ని పూర్తిగా విశ్లేషించనప్పటికీ తల్లులు తాము తీసుకునే ప్లాస్టిక్ ప్యాకెట్ ఫుడ్స్, డ్రింక్స్, కాస్మొటిక్స్ పట్ల మాత్రమే కాకుండా ధరించే సింథటిక్ వస్త్రాల ద్వారా కూడా కలుషిత మైక్రోప్లాస్టిక్స్ శరీరంలోకి చేరే ప్రమాదం ఉండవచ్చని హెచ్చరిస్తున్నారు. తల్లి చనుపాలను పిల్లలకు ఇవ్వడం అత్యవసరమని, ప్లాస్టిక్ ప్యాకెట్లలోని ఆహార పదార్థాలు, పానీయాలపట్ల తల్లులు, కుటుంబ సభ్యులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రపంచ మానవాళితో పాటు ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు, విద్యాధికులు, నిపుణులు మైక్రోప్లాస్టిక్స్/కాలుష్యం పట్ల సామాన్య జనానికి, గర్భవతులకు, తల్లులకు అవగాహన కల్పించవలసి ఉంటుంది. నేడు ప్లాస్టిక్స్ సర్వవ్యాప్తం అయ్యింది. అతి సున్నితమైన నవజాత శిశువుల శరీరంపై మైక్రోప్లాస్టిక్స్ ప్రభావం ప్రమాదకరంగా మారవచ్చని గమనించాలి. శిశువు తాగే బాటిల్ పాల రూపంలో కొన్ని మిలియన్ల మైక్రోప్లాస్టిక్ కణాలు వారి శరీరంలోకి చేరుతున్నట్లు తెలుస్తున్నది. నానో-పరిమాణ ప్లాస్టిక్స్ శరీరంలో ఉన్నట్లయితే ప్రమాదం అధికంగా ఉండవచ్చని తెలుస్తున్నది.

నీరు, శీతల పానీయాలు, పాల ప్యాకెట్లు, ఆహార పదార్థాలు, వంట నూనెలు, ప్లాస్టిక్ బాటిల్స్, పండ్ల రసాలు, ఔషధాలు లాంటి అనేక పదార్థాలు ప్లాస్టిక్ ప్యాకెట్లు/బాటిల్స్ రూపంలో మన ఇంట్లోకి చేరుతున్నాయి. ప్రతి ఒక్కరు ఏడాదిలో 50,000 ప్లాస్టిక్ కణాలను (పార్టికిల్స్) పలు రూపాల్లో తింటున్నారని తేలింది. అధిక జనాభాతో పాటు పేదరికం, అపరిశుభ్రత, కలుషిత ఆహారం ఎక్కువగా ఉన్న భారత్ లాంటి దేశాల్లో మైక్రోప్లాస్టిక్స్ ప్రభావం అనేక రెట్లు ఉండవచ్చని గమనించాలి. సముద్ర జలాల నుండి పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం, వినియోగించే వస్తువుల వరకు ప్రతి చోట మైక్రో ప్లాస్టిక్ భూతం ఆవహించి ఉంది. ఇలాంటి ప్రమాదకర మైక్రోప్లాస్టిక్స్ పట్ల ప్రపంచ మానవాళి జాగరూకతతో ఉండాలని కోరుకుందాం, మన వంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం.

# వైద్య శాస్త్రంలో అనస్థీషియా ఆవిష్కరణ..

ప్రపంచ అనస్థీషియా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 16న నిర్వహించ బడుతుంది. తొలిసారిగా అనస్థీషియా (మత్తుమందు) ఇచ్చి శస్త్రచికిత్స చేసిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ అనస్థీషి యాలజిస్టుల సంఘం ద్వారా ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్16 న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ సొసైటీస్ ఆఫ్ అనస్థీషియాల జిస్టుల ద్వారా ప్రతి సంవత్సరం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని జరుపుకునే క్రమంలో 150 కంటే ఎక్కువ దేశాల నుండి అనస్థీషియా లజిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 134 కంటే ఎక్కువ సంఘాలు పాల్గొంటాయి. పూర్వకాలంలో శస్త్ర చికిత్స అనంతరం పుట్టే నొప్పిని తగ్గించేదిగా ఆల్కహాల్ (మదిర) ను గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకునే రోగికి ...6వ శతాబ్దానికి చెందిన ఆయుర్వేదానికి చెందిన శస్త్ర చికిత్సకుడు, అపర ధన్వంతరి సుశ్రుతుడు సురాపానం చేయించే వాడు. భరించలేని చాలా నొప్పికి ఉప శమనంగా వైద్యులు, నర్సులు కాకుండా ఇతర మనుషులు గట్టిగా పట్టుకుంటే శస్త్ర చికిత్స చేసేవారు. అమెరికాలోని మసెచ్యూసెట్ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16వ తేదీన విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు గిల్బర్ట్ అబోట్ అనే రోగిపై ఈథర్ వాయువును ప్రయోగించారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మసాచుసెట్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో 1846 అక్టోబర్ 16న గిల్బర్ట్ అంబార్టు గొంతుకు శస్త్రచికిత్స చేసేందుకు... విలియమ్స్ థామస్ గ్రీన్ మార్టన్ అనే వైద్యుడు ప్రముఖ దంత వైద్యుడు జాన్‌కొలిన్స్‌తో కలిసి ఈథర్ మత్తు మందు ఇవ్వగా, హార్వర్డ్ మెడికల్ స్కూల్ మొదటి డీన్ అయిన జాన్ కాలిన్స్ వారెన్, అబాట్ మెడలోని కణితి భాగాన్ని నొప్పిలేకుండా తొలగించగా, అలా దిగ్విజయంగా ఆపరేషన్ చేశారు. ఈథర్. సల్ఫ్యూరిక్ యాసిడ్, ఆల్కహాల్ మిశ్రమాన్ని సంశ్లేషణను ఇందుకు ఉపయోగించారు. 1860ల నాటికి మత్తు మందు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. 1860ల్లో యాంటీ సెప్టిక్ పద్ధతుల కనిపెట్టిన తర్వాత ఆపరేషన్లు మరింత సులువుగా మారాయి. ఈ పరిణామం వైద్యశాస్త్రంలో అద్భుతం ఆవిష్కరించడమే గాకుండా మత్తు వైద్య విభాగంలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికింది. ఇది వైద్య చరిత్రలోని అత్యంత ముఖ్యమైన సంఘటనలలో ఒకటిగా నిలిచి పోయింది. ఆ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి నుంచి ఏటా అదే రోజున ప్రపంచ అనస్తీషియా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. సాధారణ మత్తు (అనస్థీషియా) ను నియంత్రితంగా స్పృహను కోల్పోయేలా చెయ్యడానికి ఉపయోగిస్తారు, దీనిని శస్త్రచికిత్సలు నిర్వహించవలసిన అవసరం ఉన్నపుడు ఉపయోగిస్తారు. అనస్థీషియా వైద్య ప్రయోజనాల కోసం ఇవ్వబడేది, ఇది తాత్కా లికంగా స్పర్శను అలాగే స్పృహను కోల్పోయేలా చేస్తుంది. ఆపరేషన్ సమయంలో అనస్థీషియా ఉపయోగించడం వల్ల రోగి నిద్రాణ స్థితిలో ఉంటాడు. నరాల ద్వారా సంకేతాలు బదిలీకావడాన్ని అనస్తీటిక్స్ నిరోధిస్తాయి, తద్వారా మెదడు నొప్పిని గుర్తించే అనుభూతిని నిరోధిస్తాయి. ఆపరేషన్ సమయం, శరీర భాగం, వైద్య పరిస్థితి, రోగి వయస్సు తదితరాలను బట్టి మత్తు ఇచ్చే విధానాన్ని ఎంపిక చేసుకుంటారు. సాధారణ అనస్థీషియాలో... రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు, ఏమీ అనుభూతి చెందరు. స్థానిక అనస్థీషి యాలో... రోగి శస్త్రచికిత్స సమయంలో మెలకువగా ఉంటాడు, నిర్ణీత ప్రాంతాన్ని తిమ్మిరి చేయడానికి మందులు ఇంజెక్ట్ చేయ బడతాయి. ప్రాంతీయ అనస్థీషియాలో... మానిటర్డ్ అనస్థీషియా కేర్ అనేది స్థానిక అనస్థీషియాతో పాటు మత్తు, అనల్జీసియాతో పాటుగా డయాగ్నస్టిక్ లేదా థెరప్యూటిక్ విధానాల కోసం సురక్షితమైన విధానంగా మత్తు, రోగి యొక్క ఆందోళనను తగ్గించే చర్యలు, సమర్థవంత మైన నొప్పి నియంత్రణకు ఉపకరిస్తుంది.

బాయల్స్ అనే అనస్థీషియా మిషన్ కనిపెట్ట బడ్డాక, ఈ మిషన్ అనస్థీషియా విభాగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకు వచ్చింది. దీని ద్వారా ఏకకాలంలో ఒకటి కంటే ఎక్కువ అనస్థీషియా వాయువులను నిర్దిష్టమైన ప్రమాణంలో రోగి శరీరంలోకి పంపించడానికి అవకాశం ఉంటుంది. మత్తుమందు డాక్టర్లు ఉపయోగించే అనేక పరికరాలు రోగి పల్స్, బీపీ, ఆక్సిజన్ స్థాయిలు, కార్బన్‌డైయాక్సైడ్లలను ఆపరేషన్లు నిర్వహించడంలో అనస్థీషియా వైద్యులే కీలక పాత్ర పోషిస్తారు. చిన్న శస్త్ర చికిత్సలు మొదలు కొని అతి క్లిష్టమైన మెదడు, గుండె, ఊపిరి తిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, అవయవాల మార్పిడి, కీళ్ల మార్పిడిని సునాయ సంగా చేస్తున్నారు. అంటే ఐసీయూ, ప్రకృతి వైపరీత్యాలు, దీర్ఘకాలిక నొప్పుల నివారణలోనూ అనస్థీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. రోగులకు శస్త్ర చికిత్సకు ముందు సంరక్షణకు అనస్థీటిస్టులు బాధ్యత వహిస్తారు. ఆపరేషన్ థియేటర్లలో రోగికి మత్తు ఇవ్వడమే గాక అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్ ద్వారా కృత్రిమ శ్వాస అందించడం, ఆఖరి క్షణాల్లో రోగులకు శ్వాస, రక్త ప్రసరణ పునరుద్ధరించడంలో మత్తు వైద్యసేవలు ప్రధాన భూమిక పోషించడం ద్వారా క్రిటికల్ కేర్ విభాగంలో కీలకంగా మారింది. ప్రమాదాలు సంభవించి నప్పుడు ట్రామాకేర్ లోనూ, ప్రకృతి విలయాల్లోనూ, మాస్‌క్యాజువాలిటిల్లో ముఖ్య భూమిక పోషించడం ద్వారా వైద్యరంగంలో అనస్థీషియా వైద్యులు కీలకంగా మారారు..

# నగరానికి చేరువలో సరికొత్త పిక్నిక్ స్పాట్..

సెలవులు దొరికితే చాలు ఊటీ, కొడైకెనాల్, బెంగళూరు లేదా మరే ఇతర ఆహ్లాదకరమైన ప్రదేశాలకు వెళ్లాలని ఎవరికైనా ఉంటుంది. అయితే, అన్నివర్గాల ప్రజలకు అది సాధ్యపడదు. 'అంత దూరం కుటుంబసభ్యులతో వెళ్లాలంటే సెలవులు దొరకొద్దూ..! అనేవారు కొందరైతే, సరదాగా తిరగడానికి అంత ఖర్చు అవసరమా?!' అని ప్రశ్నించేవారు మరికొందరు. అదే అందరికీ అందుబాటులో, పెద్దగా ఖర్చేమీ లేకుండా ఊటీ కొడైకెనాల్‌కు వెళ్లినంత ఫీలింగ్ వచ్చే ప్రాంతం ఉందంటే ఏమనిపిస్తుంది? వెంటనే వెళ్లాలనిపిస్తుంది కదూ! మరెందుకు ఆలస్యం.. విజయవాడకు అతి సమీపంలో ఉన్న కొత్తూరు రిజర్వ్ ఫారెస్టుకు బయలుదేరదాం పదండి! ఇక్కడి సహజసిద్ధమైన ప్రకృతి వాతావరణంలో సేద తీరవచ్చు. విజయవాడ నగరానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో కొత్తూరు తాడేపల్లి అటవీ ప్రాంతం ఉంది. అక్కడికి చేరుకునేందుకు విజయవాడ - విస్సన్నపేట ఆర్ అండ్ బీ రోడ్డు మార్గంలో సుమారు 15 కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సి ఉంటుంది. అలా కొత్తూరు గ్రామం చేరుకుంటాం. అక్కడ నుంచి కుడివైపునకు రోడ్డు మార్గంలో పోలవరం కాలువ వస్తుంది. దానిని దాటి అవతల వైపు ఉన్న ప్రాంతమే కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్. ఈ బెజవాడ ఊటీ కొత్తూరు నుంచి కేవలం నాలుగు కిలో మీటర్ల దూరంలోనే ఉంది. చుట్టూ ఎత్తయిన కొండలు, మధ్యలో మైదాన ప్రదేశం ఇక్కడి ప్రత్యేకత. చల్లని నీడనిచ్చే గుబురు గుబురుగా ఉన్న వెదురు చెట్లు, చుట్టూ ఏపుగా పెరిగిన జామాయిల్ చెట్లు, అక్కడక్కడా వేప, నేరేడు, గానుగచెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తుంది. ఇంతటి ప్రశాంత వాతావరణం విజయవాడ నగరానికి అతి సమీపంలోనే ఉందంటే ఆశ్చర్యం కలగకమానదు. మైదాన ప్రదేశానికి వెళ్లే దారి పొడవునా చల్లని పిల్లగాలులతో డొంకకు రెండువైపులా ఉన్న చెట్లు స్వాగతం పలుకుతాయి.

రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం అడవులను సంరక్షించాలనే ఉద్దేశంతో వన సంరక్షణ సమితులను (వీఎస్ఎస్) తెరమీదకు తెచ్చింది. అందులో భాగంగానే విజయవాడకు సమీపంలోని కొత్తూరు తాడేపల్లి, నున్న గ్రామాలలో ఏర్పాటు చేసింది. అటవీశాఖ వీరికి నేరేడు, వేప, వెదురు, జామాయిల్, మామిడి తదితర మొక్కలను సరఫరా చేశాయి. అలా అప్పుడు నాటిన మొక్కలే దశాబ్దంన్నర కాలానికి వృక్షాలుగా దర్శనమిస్తూ, అడవి అందాలను మరింతగా పెంచాయి. భవిష్యత్తులో పర్యాటక ప్రదేశంగా కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్ మరింత అభివృద్ధి చెందుతోందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఒకప్పుడు అక్కడకు వెళ్లాలంటే రాళ్లు రప్పల్లో వెళ్లాల్సి వచ్చేది. అయితే, అటవీశాఖ అధికారులు రహదారులను, డొంకను అభివృద్ధి చేశారు. సుమారు 20 ఎకరాలకు పైగానే ఉన్న మైదాన ప్రాంతానికి ఓ కొత్తరూపాన్ని ఇచ్చారు. ప్రకృతి మలచిన



అందమైన శిల్పంలా ఇక్కడి ప్రదేశాలు సందర్శకులను రా.. రమ్మని ఆహ్వానం పలుకుతాయి.

మంచి పిక్నిక్ స్పాట్..: సందర్శకులు మైదాన ప్రదేశానికి వెళ్లి, సేద తీరేందుకు వీఎస్ఎస్ నిర్వాహకులు చిన్న షెడ్‌ను కూడా ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం అక్కడే బావి ఒకటి తవ్వారు. అందులోని నీళ్లు నిత్యం చల్లగా ఉంటాయంటే అతిశయోక్తి కాదు. అంతేకాదు ఆ బావి నీరు కృష్ణా, గోదావరి నదుల్లోని నీటి కంటే రుచిగా ఉంటాయనేది ఆ నీళ్ళు తాగినవారి అభిప్రాయం. ఇక్కడి ప్రకృతి అందాలను గుర్తించిన స్థానికులు గత రెండుమూడేళ్ల నుంచి ఏటా కుటుంబ సమేతంగా పిక్నిక్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. దగ్గరలోనే అన్ని సదుపాయాలు ఉండటంతో ఆ ప్రాంతం గురించి తెలిసిన వారు అక్కడకు వెళుతున్నారు. ఒక్క పిక్నిక్ కాదండోయ్ స్థానికులు తరచూ చిన్న చిన్న విందు కార్యక్రమాలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసుకుంటుంటారు. నిజమే! నిత్యం రణగణ ధ్వనులతో సతమవుతున్న నగర వాసులు ఇలాంటి ప్రశాంత వాతావరణానికి వెళ్ళి, కొన్ని గంటలైనా విశ్రాంతి తీసుకొంటే ఆ రిలీఫే వేరు.

కొండ కోనల మధ్యలో: ఈ పర్యాటక ప్రదేశం కొండ కోనల మధ్యలో చూడచక్కగా ఉంటుంది. చుట్టూ కొండలు, ఏటవాలుగా ఉన్న ప్రదేశంలో ఎత్తయిన జామాయిల్ చెట్లు ఏపుగా పెరిగి ఉంటాయి. ఇవి. చూడటానికి ఎంతో అందంగా కనిపిస్తాయి. అభయారణ్యమే అయినప్పటికీ, ప్రస్తుతం దాని స్వరూపం పూర్తిగా మారిపోయింది. నాలుగైదుగ్రామాలకు వెళ్లేందుకు

మార్గం కూడా ఏర్పాటైంది. మొక్కలను పెంచేందుకు వన సంరక్షణ సమితులు ప్రత్యేకంగా చెక్ డ్యామ్లను ఏర్పాటు చేశాయి. వర్షాకాలంలో కొండల నుంచి జాలువారే నీటిని నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా కుంటలను కూడా ఏర్పాటు చేశారు. కొండకు దగ్గరలో కనిపించే చిన్న చిన్న వాగులు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. ఇక్కడకు చేరుకునే యువత ఫోటోలకు ఫోజులచ్చేందుకు ఈ స్పాట్‌లు ఎంతగానో ఉపకరిస్తాయి. కొండలపైకి చేరుకునేందుకు బైక్ రైడ్ ఎంతో సాహస క్రీడలను తలపిస్తుంది. కొత్తవారు ఈ ప్రాంతంలో కాస్త కన్ఫ్యూజ్ అవుతారు. అందుకే ఇక్కడి ప్రదేశాలపై అవగాహన ఉన్నవారి సహకారం తీసుకోవాలి.

# ఈ వస్తువులను నేలపై పెడితే..

మన హిందూ ధర్మశాస్త్రం ప్రకారం కొన్ని వస్తువులను ఎంతో పవిత్రంగా చూసుకుంటాం. వాటిని కింద కానీ అపరిశుభ్రమైన ప్రదేశంలో కానీ, మంచం మీద కానీ ఎక్కడ పెట్టం. పూజకు ఉపయోగించే పువ్వులు, కొబ్బరికాయలు, కర్పూరం, ఆగర్బత్తి వంటి పూజకు ఉపయోగించే వస్తువులను మనం ఎట్టి పరిస్థితుల్లో కింద పెట్టం. ఒకవేళ కిందపెడితే వాటిని పూజకు ఉపయోగించము. అలా కింద పెట్టిన వస్తువులను పూజకు ఉపయోగిస్తే అశుభం జరుగుతుందని చాలా మంది నమ్ముతారు. ఇవే కాక మన హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో కింద పెట్టని మరో ఐదు వస్తువులు ఉన్నాయి. వాటిని కనుక నేల మీద పెడితే అంతా అశుభమే జరుగుతుందని పండితులు చెబుతున్నారు. హిందూ ధర్మశాస్త్రం ప్రకారం ఎట్టిపరిస్థితుల్లో కింద పెట్టకూడని వస్తువుల్లో మొదటిది దీపం. వెలుగుకు ప్రతిరూపంగా దీపాన్ని భావిస్తారు. దేవుడు ముందు పెట్టే దీపాలను ఎట్టి పరిస్థితులోనూ నేల పెట్టరాదు. వాటిని వెలిగించిన, వెలించకపోయిన వాటిని శుభ్రమైన వస్త్రం మీదే ఉంచాలి. అంతేకానీ నేల మీద పెట్టరాదు. నేల మీద దీపాలు పెడితే దేవున్ని అవమానించినట్టే అవుతుందట. మనకు అవసరమైన వాటిని పొందడానికి, ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించుకోవడానికి సులభమైన మార్గం దీపారాధన. దీపం వెలుగుపడిన చోట ఆధ్యాత్మిక శక్తి ఆ స్థలాన్నినింపుతుంది. ఇక కింద పెట్టని పవిత్రమైన వస్తువుల్లో రెండవది బంగారం. బంగారం అంటే సాక్షాత్తు లక్ష్మీ దేవి స్వరూపంగా భావిస్తాం.

అలాంటి బంగారాన్ని నేల మీద పెడితే లక్ష్మీ దేవి ఆగ్రహానికి లోనై అనేక కష్టాలు పడతారు. అలా చేసిన వారికి ఇంట్లో ధనం ఒక్క క్షణం కూడా నిలవదట. కుటుంబానికి అన్నీ సమస్యలే వస్తాయట. కాబట్టి బంగారాన్ని కూడా ఎట్టి పరిస్థితుల్లో కింద పెట్టకూడదు. కింద పెట్టకూడని వస్తువుల్లో మూడవది జంధ్యం. జంధ్యం గురించి తెలిసిన వారు ఎవరూ దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ కింద పెట్టరు. బ్రహ్మణులు జంద్యాన్ని తల్లిదండ్రులకు, గురువులకు ప్రతి రూపంగా భావిస్తారు. అందుకే దానిని కింద పెడితే తల్లిదండ్రులను, గురువులను అవమానించినట్టే అవుతుందట. ఇక నాలుగవది శంఖువు. శంఖువులో సాక్ష్యాత్తు లక్ష్మీ దేవి కొలువై ఉంటుందట. కనుక శంఖువును కూడా నేలపై పెట్టకూడదు. శంఖువును నేలపై పెడితే లక్ష్మీ దేవి ఆగ్రహానికి గురి అవుతాము. దాంతో మన ఇంట్లో ఆర్థిక సమస్యలు వస్తాయట. ఇక చివరగా హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో కింద పెట్టకూడని వస్తువుల్లో చివరది సాలిగ్రామం. నేపాల్ లోని గండకి నది తీరంలో ఒకరకమైననల్లరాయి దొరుకుతుంది. దాన్ని సాలిగ్రామం అంటారు. ఆ రాయి విష్ణువుకు ప్రతిరూపం అని పురాణాలు చెబుతున్నాయి. ఈ రాయి విష్ణువుకు ప్రతిరూపం కాబట్టి నేలపై అస్సలు పెట్టకూడదు. అలా చేస్తే నేలపై పెట్టిన వారికి అప్పటి నుండి అన్నీ సమస్యలే ఎదురవుతాయట. ఒకవేళ నేలపై పెట్టాల్సి వస్తే చెక్కతో చేసిన శుభ్రమైన ఉపరితలం మీద మాత్రమే పెట్టాలట.

## 5జిపై 5 శాతం మందే ఆసక్తి


(న్యూఢిల్లీ)

మెజారిటీ ప్రజలు 5జి టెలికం సేవల పట్ల అనాసక్తిని కనబర్చుతున్నారు. 5 శాతం లోపు మంది మాత్రమే ఈ సేవలను కోరుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదిక లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడయ్యింది. దేశంలోని 318 జిల్లాల్లోని 29,000 మంది మొబైల్ వినియోగదారులను సర్వే చేసి ఈ రిపోర్టును రూపొందించినట్లు ఆ సంస్థ తెలిపింది. జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు ఇప్పటికే పలు నగరాల్లో 5జి సేవలను లాంచనంగా ప్రారంభించగా..

వచ్చే ఏడాది మార్చి నాటికి దశల వారిగా దేశ వ్యాప్తంగా అందుబాటులోకి తెస్తామని ప్రకటించాయి. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆసక్తులను కనుక్కోవడానికి లోకల్ సర్కిల్స్ సర్వే చేసింది. 5జి సేవల కోసం తాము అదనం చార్జీలు చెల్లించలేమని 43 శాతం స్పష్టం చేశారు. 5జిపై ఆసక్తి చూపిన వారిలో ప్రస్తుత టారీఫ్‌లను 10 శాతం పెంచితే పర్వాలేదని 43 శాతం మంది పేర్కొన్నారు. 10-25 శాతం టారీఫ్‌లు పెంచిన కొనుగోలు చేస్తామని కేవలం 2 శాతం మంది మాత్రమే పేర్కొన్నారు.

# మహిళలు రాత్రి షిఫ్టులో విధులు నిర్వహిస్తున్నారా..?

నేటి యుగంలో డిజిటల్ టెక్నాలజీ మానవుల సవాళ్లను కూడా పెంచుతోంది. కొత్త కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వైద్య నిపుణులు పదేపదే చెబుతున్నారు. ప్రజలు తమ కెరీర్‌లో ముందుకు రావడానికి చాలా కష్టపడతారు. తమ ఉత్తమమైనదాన్ని అందించడానికి చాలాసార్లు ప్రజలు కొన్నిం టిని ఎదుర్కొనేందుకు వెనుకాడరు. ఉద్యోగ రీత్య చాలా మంది రాత్రి షిఫ్ట్‌లో పనిచేయడానికి వెనుకాడరు. అయితే నైట్ షిఫ్ట్‌లో పని చేయడం చాలా ప్రమాదకరమని ఎన్నో పరిశోధనలు వెల్లడించాయి. నైట్ షిఫ్ట్‌లో పని చేయడం వల్ల మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. రాత్రి షిఫ్ట్‌లో ఎక్కువసేపు పనిచేసే మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం చాలా రెట్లు పెరుగుతోంది. నైట్ షిఫ్ట్‌లో పనిచేయడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని ప్రపంచవ్యాప్తంగా అనేక రకాల పరిశోధనలు వెల్లడించాయి. వాషింగ్టన్ స్టేట్ యూనివర్శిటీ చేసిన పరిశోధనలో కూడా ఈ విషయం వెల్లడైంది. ఈ పరిశోధన రాత్రి షిఫ్ట్‌లో పనిచేసే వారికి చర్మ క్యాన్సర్‌తో పాటు ఊపిరితిత్తుల క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కనుగొన్నారు. మీరు రాత్రి పని చేసినప్పుడు అది మిమ్మల్ని కాంతికి గురి చేస్తుంది. ఇది మీ సిర్కాడియన్ రిథమ్‌లో ఆటంకాలను కలిగిస్తుంది. ఇది ప్రోలాక్టిన్, గ్లూకోకార్టికాయిడ్లు, అడ్రినోకార్టికోట్రోపిక్ హార్మోన్, సెరోటోనిన్, మెలటోనిన్‌తో సహా మీ శరీరంలోని అనేక



హార్మోన్ల ప్రవాహాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. నిరంతర రాత్రి షిఫ్టులు శరీరంలో మెలటోనిన్ సంశ్లేషణకు ఆటంకం కలిగిస్తాయి. ఇది ఈస్ట్రోజెన్ స్థాయిల పెరుగుదలకు దారితీస్తుంది. ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచడానికి కారణం.

ఇది కూడా కారణం: రాత్రిపూట పనిచేసే స్త్రీలు కూడా ఒత్తిడిని వదిలించుకోవడానికి ధూమపానం చేయడం కూడా చేస్తుంటారు. దీని వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుంది. రొమ్ము క్యాన్సర్‌ను నివారించడానికి రాత్రి షిఫ్ట్‌లో పనిచేయడం మానుకోవడం మంచిదని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. రాత్రి పూట పని చేయాల్సిన అవసరం ఉంటే పగటిపూట కనీసం 7-8 గంటలు నిద్రపోండి. దీనితో పాటు, మీరు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కూడా అనుసరించండం ముఖ్యమంటున్నారు.

# మహిళా ఓటర్లే అధికం..!

### - జిల్లా ముసాయిదా జాబితా విడుదల



జగిత్యాల: జిల్లా ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు ఇటీవలే విడుదల చేయగా గత ముసాయిదాతో పోలిస్తే కొత్త ఓటర్ల సంఖ్య 7,803కు పెరిగింది. గత నవంబరు నుంచి డిసెంబరు వరకు ప్రత్యేక ఓటరు నమోదును చేపట్టగా ప్రతి పోలింగ్‌బూత్ పరిధిలోనూ పెద్దఎత్తున ప్రచారం చేయటంతో కొత్త ఓటర్ల నమోదు గణనీయంగా పెరిగింది. చాలామంది బూత్‌స్థాయి అధికారులు, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలతో పాటుగా ఆన్‌లైన్ మీసేవ కేంద్రాల ద్వారానూ ఓటర్లుగా చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు అధికారులు బూత్‌లవారీగా పాత జాబితా, కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారి పేర్లను పరిశీలించారు. మరణించినవారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించి, కొత్తవారిని చేర్చి తుదిజాబితాను అధికారులు విడుదల చేశారు. రెండుచోట్ల ఓటుహక్కు కలిగినవారు, ఇతర ప్రాంతాల్లోకి వెళ్లినవారు, పేరుమార్పు, చిరునామా మార్పుల దరఖాస్తులను సైతం పరిశీలించి మార్పులు చేర్పులను నమోదు చేశారు. తాజా జాబితా ప్రకారం జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో మొత్తం 785 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 6,48,050 సాధారణ, ఎన్ఆర్ఐ, ఇతర ఓటర్లు, 221 మంది సర్వీసు ఓటర్లున్నారు. మొత్తం మూడు నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు 18,881 అధికంగా ఉండగా విశేషంగా చెప్పవచ్చు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ పట్టణాలు, అన్ని గ్రామాల్లోనూ పెద్దఎత్తున పురుషులు సంవత్సరాల తరబడి విదేశాలు, ఇతర ప్రాంతాలకు ఉపాధి పనుల నిమిత్తం వెళ్తుండటంతో ఓటరు జాబితాల్లో వీరిపేర్లులేక పురుష ఓటర్ల సంఖ్య తగ్గుతోంది. జాబితాల్లో మహిళలసంఖ్య చాలాఎక్కువగా ఉండగా శాసనసభ, లోక్‌సభ, సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పురపాలక తదితర ప్రతి ఎన్నికల్లోనూ జిల్లాలో మహిళా ఓటింగ్‌శాతమే చాలా ఎక్కువగా నమోదవుతోంది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల్లోని వారుకూడా ఆన్‌లైన్‌ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా కేంద్రం రిమోట్ ఓటింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుండటం జిల్లాలోని వేలాదిమంది వలస జీవుల్లో ఆనందాన్ని నింపుతోంది. ఆర్‌వీఎం వ్యవస్థను అందుబాటులోకి తెచ్చే క్రమంలో ముందుగానే జిల్లాలోని దాదాపుగా 45 వేలమంది అర్హులైన ఓటర్లందరి పేర్లను ఓటరు జాబితాలో చేర్చాల్సిఉంది. జాబితాలో ఓటర్లందరి పేర్ల నమోదు, ఆర్‌వీఎం వ్యవస్థ అమలుతో ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగి ఫలితాల్లో కచ్చితత్వం మెరుగుపడే అవకాశముంది.

# అధికారుల నిర్లక్ష్యం.. దళారులకు లాభం

### - మార్కెట్ యార్డులో చేపట్టని పత్తి కొనుగోళ్లు



వేములవాడ: ఒకప్పుడు పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలతో కళకళలాడిన వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు నేడు వెలవెలబోతోంది. అధికారుల అలసత్వం, మార్కెట్ కమిటీ పాలక వర్గం నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి కొనుగోళ్లు జరగక అలంకారప్రాయంగా మారింది. ఇదే అదనుగా గ్రామాల్లో దళారులు పత్తిని రైతుల వద్ద తక్కువ ధరకు సేకరించి భైంసా, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు చేపడితే వ్యాపారుల మధ్య పోటీ ఎక్కువై ధర పెరిగి రైతులకు గిట్టుబాటు అయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. మార్కెట్ కమిటీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. గ్రామాల్లో క్వింటాల్ పత్తికి రూ.7,500 వరకు దళారులు చెల్లిస్తున్నారు. మరోవైపు కొందరు దళారులు తూకాల్లోనూ మోసాలకు పాల్పడుతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. వాస్తవానికి వరంగల్, జమ్మికుంట, ఆదిలాబాద్ ప్రాంతాల్లో క్వింటాల్ పత్తికి రూ.8,100 వరకు ధర పలుకుతున్నప్పటికీ గ్రామాల్లో మాత్రం దళారులు బాగా తక్కువ ధరకు చెల్లిస్తున్నారు. రోజూ ఈ ప్రాంతం నుంచి అయిదు నుంచి పది వాహనాల్లో భైంసా, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తరలి వెళ్తుంది. ఇందులో కొన్నింటికే మార్కెట్ ఫీజు వసూలు అవుతుందనే ఆరోపణలున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.17,98,240ల ఫీజును వసూలు చేశారు. వేములవాడ మార్కెట్ పరిధిలోని తిప్పాపూర్, కోనాయిపల్లి వద్ద ఉన్న రెండు చెక్ పోస్టుల ద్వారా నామమాత్రపు ఫీజు వసూలు చేసి సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో దళారులు పెద్ద ఎత్తున సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించడంతో మార్కెట్ కమిటీ భారీగా ఆదాయాన్ని కోల్పోతోంది. దీనికి తోడు జిన్నింగ్ మిల్లులకు పత్తి దిగుబడులు రాక మిల్లుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లకు అధికారులు నిర్లక్ష్యం చూపడంతో దళారులకు కాసుల పంట పండుతోంది. ఇదే అదనుగా దళారులు గ్రామాల్లో పత్తిని నిబంధనలకు విరుద్ధంగా సేకరించి సొమ్ము చేసుకుంటున్నా మార్కెట్ కమిటీ అధికారులు మామూలుగా తీసుకొంటున్నారు. మార్కెట్ పరిధిలో 26 మంది లైసెన్స్ వ్యాపారులున్నప్పటికీ యార్డులో మాత్రం కొనుగోళు చేయడం లేదు. జిల్లాలో ఈ సీజన్‌లో 69,200 ఎకరాల్లో పత్తి సాగు కాగా మొత్తం 4.84 లక్షల క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 20,500 క్వింటాళ్లు మాత్రమే జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు జరిగినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. గ్రామాల నుంచి రెండింతల పత్తిని దళారులు ఇతర ప్రాంతాలకు తరలించారని వ్యాపారులు పేర్కొంటున్నారు. బుధవారం మార్కెటింగ్‌శాఖ అధికారులు, మార్కెట్ పాలక వర్గం వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులతో హడావుడిగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినా యార్డులో పత్తి కొనుగోళ్లకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

# నీటిపై నిలిచి.. సూర్యునితో శక్తి



జైపూర్,:సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం (ఎస్టీపీపీ) మరో ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే బొగ్గు ద్వారా 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న యాజమాన్యం సంప్రదాయేతర ఇంధన వనరులను అందిపుచ్చుకునేందుకు గత కొన్ని నెలలుగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగా మూడు దశల్లో 300 మెగావాట్ల సౌరవిద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోగా అందులో 219 మెగావాట్లను ప్రస్తుతం ఎస్టీపీపీతో పాటు సింగరేణికి సంబంధించిన మరికొన్ని చోట్ల విజయవంతంగా నిర్వహిస్తోంది. సోలార్ ప్లాంట్ల ఏర్పాటును మూడు దశలుగా విభజించుకున్న యాజమాన్యం మూడో దశలో 81 మెగావాట్లను ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా కొన్ని ప్రయోగాలతోపాటు అదనపు భూసేకరణ లేకుండానే ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో థర్మల్ విద్యుత్తు కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తికి నీటిని నిల్వ చేసే 100 ఎకరాల్లోని మూడు టీఎంసీల రిజర్వాయర్‌ను ఎంచుకుంది. ఇందులో 15 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ (నీటిపై తేలియాడే సౌరఫలకల)ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా రూ.26కోట్ల అంచనా వ్యయంతో 18 ఎకరాల్లో మొదట 5 మెగావాట్ల పనులు ప్రారంభించింది. ప్రస్తుతం ఇవి తుది దశకు చేరుకున్నాయి.. సంప్రదాయ ఇంధన వనరుల్లోనూ సింగరేణి యాజమాన్యం నూతన సాంకేతిక పరిజ్ఞాన్ని అందిపుచ్చుకుంది. ఇందులో భాగంగా సౌర ఫలకాల్లో గ్లాస్ టూ గ్లాస్ పరిజ్ఞానంతో తయారైన వాటిని వాడుతోంది. ఒక్కో ఫలక ద్వారా 335 వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశముంది. దీంతో 5 మెగావాట్లలో 21 మీటర్ల పరిమాణంలో ఉండే 20 వేల ఫలకాలను సిద్ధం చేస్తున్నారు. వీటిని రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలకు అమరుస్తారు. దీంతో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకు 25వేల యూనిట్ల విద్యుత్తు చొప్పున సరాసరి ఏడాదికి 20 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేయనుంది. మిగతా సౌరఫలకాలతో పోల్చితే వీటి జీవిత కాలం ఎక్కువగా ఉండటంతో 25 ఏళ్ల పాటు విద్యుత్తు ఉత్పత్తి చేసే అవకాశముందని ఎస్టీపీపీ అధికారులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం ఏడాదికి రూ.450 కోట్ల వరకు విద్యుత్తు కోసం ఖర్చు చేస్తుండగా సోలార్ ప్లాంట్లద్వారా సరాసరిన రూ.200 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశముంది. మిగతా సోలార్‌లతో పోలిస్తే ఈ ఫ్లోటింగ్ సోలార్‌లో భూసేకరణకు లేకుండా రిజర్వాయర్‌లో నీటి ఆవిరిని తగ్గించుకోవడంతోపాటు విద్యుత్తు ఉత్పత్తిని సైతం 3 నుంచి 4శాతం అధికంగా సాధించే అవకాశముంది. ఇక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్తును జైపూర్‌లో 33/11కేవీ విద్యుత్తు కేంద్రానికి అనుసంధానించి అవసరం ఉన్న చోట్ల వినియోగించుకుంటారు.

# ఇళ్లకు జియో ట్యాగింగ్..!



కరీంనగర్ : నగర, పురపాలికల్లో ఆస్తుల సమగ్ర సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను జియోట్యాగింగ్ చేసే ప్రక్రియను పూర్తి చేసేలా సర్వే కొనసాగుతోంది. కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు మున్సిపాలిటీల్లో ఇళ్లకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు భువన్ యాప్‌లో నమోదు చేసేలా రెండేళ్ల కిందట కార్యాచరణ తీసుకోగా అత్యధిక పురపాలికల్లో పూర్తయింది. కొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో వెనుకబడి పోగా ప్రస్తుతం లక్ష్యాన్ని సాధించేందుకు నగర పాలక రెవెన్యూ అధికారులు వీధుల్లో పర్యటించి ఆస్తుల నమోదు చేస్తున్నారు. విలీన కాలనీల్లో భువన్ సర్వే చేపట్టగా ఆ వివరాలన్నీ నిక్షిప్తమయ్యాయి. భువన్ యాప్‌లో ప్రతి ఇంటి వివరాలు ఆన్‌లైన్‌లో, ధరణి వెబ్‌సైట్‌లో నమోదవుతాయి. ఎవరి ఆస్తి ఎవరి పేరు మీద ఉందనే పక్కా సమాచారం అందులో ఉండనుంది. సర్వే సమయంలో ఆస్తి మదింపు వివరాలు, భవన చిత్రం, అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా చరవాణిలో చిత్రాలు తీస్తారు. ఇంటినెంబర్లు లేని ఇళ్లు, పన్ను పరిధిలోకి రాని అంతస్తులు, అక్రమ నిర్మాణాలు, భవన విస్తీర్ణం, ప్రభుత్వ భవనం వంటి ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. వాణిజ్య భవనాల వివరాలు, నల్లా కనెక్షన్లు, సెల్ టవర్లు, దుకాణాల లైసెన్సులు ఇందులో నమోదు చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లో సర్వే 90 శాతం పూర్తి చేశారు. కరీంనగర్ నగరపాలికలో మాత్రం నత్తనడకన సాగుతోంది. మొదటి విడతలో 35.39 శాతం మాత్రమే కాగా, రెండో విడతలో 55 శాతానికి చేరింది. జియోట్యాగింగ్ పూర్తి చేయాలని పురపాలక శాఖ ఆదేశించడంతో రెండు నెలలుగా మళ్లీ ప్రారంభించారు. ఇప్పటివరకు 73.11 శాతం పూర్తి చేశారు. బిల్‌కలెక్టర్లతోపాటు వారధి నుంచి కొంతమందిని తీసుకొని సర్వే చేస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ సర్వే కారణంగా తాత్కాలికంగా బ్రేక్ పడగా ఈసారైనా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి. నగరంలోని ఇళ్లకు జియోట్యాగింగ్ చేస్తుండగా ఈ సమయంలో భవనానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని క్రోడీకరిస్తారు. ప్రతి ఇంటికి కొలతలు నిర్వహిస్తారు. ఇప్పటివరకు ఆస్తిపన్ను మదింపు పరిధిలోకి రాని అంతస్తులను కూడా ఇందులో పరిగణనలోకి తీసుకుంటారు. పన్ను పెంచకుండానే అదనంగా ఎంతమేర కట్టుకుంటారో ఆ మేరకు ఆస్తిపన్ను మదింపు ఆటోమెటిక్‌గా జరిగిపోతుంది. ప్రస్తుతం నిర్వహించే కొలతల భవనాలకు వచ్చే ఏడాది పన్ను పెరిగే అవకాశముంది. ఎక్కువ కొలతలు ఇచ్చి తక్కువ విస్తీర్ణంలో ఇల్లు ఉన్నట్లేయితే వాటికి పన్ను సర్దుబాటు కానుంది.

# ఉపాధి కరవు.. ప్రత్యామ్నాయం బరువు

### ఆదుకోవాలంటున్న బీడీ కార్మికులు



నిర్మల్: వ్యవసాయం తర్వాత అంతలా అవకాశాలు కల్పించిన బీడీ పరిశ్రమ సంక్షోభదిశగా పయనిస్తుండటంతో కార్మికులకు ఉపాధి కరవైంది. దీనిపై ఆధారపడి ఉమ్మడి జిల్లాలో లక్షల మంది కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారు. దశాబ్దాలుగా ఉపాధి కల్పించిన ఈ పరిశ్రమ బలహీన పడుతుండటం కార్మికులకు శాపంగా మారుతోంది. దీంతో కొంతమంది కార్మికులు తప్పనిసరై ప్రత్యామ్నాయం వైపు దృష్టి సారిస్తున్నారు. అయిదారేళ్ల క్రితం వరకు నెలలో 26రోజులు బీడీలు చుట్టే పని ఉండేది. ప్రస్తుతం 10 నుంచి 12 రోజుల కంటే మించడం లేదు. పనిలేక గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులకు వెళ్తుండగా.. మరికొందరు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తుండగా.. ఇంకొందరు స్వయం ఉపాధివైపు ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణాల్లో బీడీ కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. చాలా మంది కిరాణకొట్టు, కూరగాయలు విక్రయించడంతోపాటు షాపింగ్‌మాల్స్‌లలో పనులు చేస్తూ జీవనం గడుపుతున్నారు. నాలుగేళ్ల క్రితం బీడీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు స్వయం ఉపాధి పొందేందుకు ఉద్యానవనం (పండ్లు, పూలు, కూరగాయల సాగు), కోళ్ల పరిశ్రమ, గేదెలు, గొర్రెల పెంపకం, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, చేతి వృత్తులు, అగర్‌బత్తుల తయారీ, పాపడ్, పచ్చళ్ల తయారీపై శిక్షణ ఇచ్చి ఆదుకుంటామన్న అధికారులు మాటలు గాలిలో కలిసిపోయాయి. కార్మికులు రోజంతా రెక్కలు..ముక్కలు చేసుకొని కూర్చుండి చేసే వెయ్యి బీడీలకు వారికిచ్చేది కేవలం రూ.221.21 మాత్రమే. కంపెనీలు 10 నుంచి 12 రోజులే పనిచేస్తున్నాయి. కార్మికులతో రోజు 500 బీడీలు మాత్రమే చేయిస్తున్నారు. ఈ లెక్కన వారికి నెల కూలీ రూ.2,212.10 నుంచి రూ.2,654.52 మాత్రమే వస్తోంది. దీనికితోడు ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. క్షయ, క్యాన్సర్, కళ్ల సంబంధిత జబ్బులతో బతుకులు పొగబారుతున్నాయి. ప్రస్తుతంఉపాధిహామీ కూలీ కింద వచ్చే డబ్బులతో పోలిస్తే ఇది చాలా తక్కువే. బీడీలు తాగడం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు విపరీతంగా విస్తరిస్తున్నాయనే కారణంతో 2018 ఏప్రిల్ 1 నుంచి బీడీ కట్టలపై పుర్రె గుర్తులు ముద్రించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంక్షోభాన్ని సృష్టించగా.. జీఎస్టీ విధింపుతో పరిస్థితి మరింతగా విషమించింది. బీడీల రేట్లు అమాంతం పెరిగిపోయాయి. తాగేవారి సంఖ్య తగ్గింది. పీఎఫ్ కటాఫ్ తేది (2014)ఎత్తివేసి బీడీలు చుట్టే వారందరికీ జీవనభృతి అందజేస్తామని 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో కార్మికులకు పీఎఫ్ ఉన్నా జీవనభృతి అందడం లేదు.

# ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి: కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 18 నుంచి చేపట్టే కంటి వెలుగును విజయవంతం చేయాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక అధికారులు, వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటి వెలుగు నిర్వహణకు జిల్లాలో 50 బృందాలను ఏర్పాటు చేసినట్లు, మరో మూడు బృందాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. శిబిరాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి శిబిరాలలో అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రాలు, కరపత్రాలు అందించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు, వైద్యాధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. అంతకు ముందు ఖమ్మం కలెక్టరేట్ నుంచి మంత్రి హరీశ్‌రావు అన్ని జిల్లాల కలెక్టర్లతో దూర దృశ్య శ్రవణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష అనంతరం స్థానిక కలెక్టరేట్లో పాల్గొన్న కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు జి.శ్రీనివాస్, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ మాట్లాడారు. జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ షెడ్యూల్‌ను సంబంధిత ప్రజాప్రతినిధులకు ముందే తెలియజేయాలన్నారు. నిర్వహణ సమయంలో విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అంతకుముందు ప్రజారోగ్య వైద్య సంచాలకులు డా.శ్రీనివాస్ అంబేడ్కర్ నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న కంటివెలుగు నమూనా శిబిరాన్ని సందర్శించి సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఎదురైతే పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. వివిధ శాఖలకు 8 దరఖాస్తులు అందాయన్నారు.


# ప్రజారోగ్యంతో చెలగాటం

### - నాసిరకమైన ఆహార పదార్థాల తయారీ
### - అపరిశుభ్ర పరిసరాల మధ్య అమ్మకాలు



గోదావరిఖని : ఉమ్మడి జిల్లాలో ఆహార పదార్థాల తయారీ కేంద్రాల్లో శుభ్రత పాటించడం లేదు. నాసిరక, కాలం చెల్లిన వస్తువులతో ఆహార పదార్థాలను తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. పెద్దపెద్ద హోటళ్లలో వారం పాటు నిల్వ చేసిన మేక మాంసాన్ని వండిపెడుతున్నారు. ఇక రోడ్డుపక్కన తినుబండరాలు తయారు చేసే చిరు వ్యాపారులు ఆహార పదార్థాల తయారీకి వినియోగించే ప్రతీది నాసిరకమే. మార్కెట్‌లో కేవలం తినుబండరాలు, బేకరీ ఐటెమ్‌లు, హోటళ్ల కోసమే పూర్తిస్థాయిలో నాణ్యత లేని వస్తువులను తయారు చేసి విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు వస్తుండటంతో హోటల్ యజమానులు, ఫాస్టుఫుడ్ కేంద్రాలు, వీధి వ్యాపారులు వీటినే కొనుగోలు చేస్తూ ఆహార పదార్థాల తయారీకి వినియోగిస్తున్నారు. పెద్ద రెస్టారెంట్లుగా ప్రచారం చేసుకుంటున్న నిర్వాహకులు సైతం శుచి, శుభ్రత పాటించడం లేదు. ఉమ్మడి జిల్లాలో 3,500 వరకు రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్టుఫుడ్, తినుబండరాలు తయారు చేసే వీధి వ్యాపారులున్నారు. ఆహార పదార్థాలు తయారు చేసే వంట గదులు, ప్రాంతాలు కంపుకొట్టే పరిస్థితి ఉంటుంది.

# సిరులు కురిపిస్తున్న కెపి ఉల్లి



చాపాడు ఉల్లి పేరు వినగానే మార్కెట్లో ఎవరి నోట విన్నా ఘాటు వినిపిస్తుంది. కెపి (కృష్ణా పురం) ఉల్లి ధరలు మరింత ఘాటుగా ఉండటంతో సాగు చేసిన రైతులకు ఈ ఏడాది సిరు లు కురిపిస్తున్నాయి. రెండేళ్ల కంటే అధిక ధరలు పలుకుతున్నాయి. ఈ ఏడాది కెపి ఉల్లికి మార్కెట్ లో మంచి డిమాండ్ ఏర్పడింది. గతంలో పండించిన పంటను అమ్మకం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ఈ ఏడాది పంట పోలాలోకి వ్యాపారులు వరుస కడుతున్నారు. నూర్పిడి చేసిన వెంటనే కొనుగోలు చేసి తరలిస్తున్నారు.కెపి ఉల్లి సాగు చేసిన రైతులకు ఈ ఏడాది రూ.పది సంపాదించుకునే అవకాశం ఏర్పడింది. కొన్నేళ్లుగా పండించిన పంటను అమ్ముకునేందుకు మాత్రం నానా కష్టాలు పడాల్సి వచ్చేది. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొంటున్నారు .విత్తనాలు కిలో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు వెచ్చించి కొనుగోలు చేసి ఎకరాకు 23 కిలోల వంతున వినియోగించారు. ప్రస్తుతం నూర్పిడి చేసేందుకు రూ.10 వేలు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. గత నెలలో వర్షాలు పడటంతో ఉల్లిగడ్డలు కుళ్లి ఇబ్బందికరంగా మారి దిగుబడి మాత్రం తగ్గిందని రైతులు పేర్కొంటున్నారు. క్వింటా రూ.9500 నుంచి రూ.10 వేలు పలుకుతుండటంతో దళారులు కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. రాయలసీమకు విదేశీ మారక ద్రవ్యం తీసుకువచ్చే అతి పెద్ద పంట కెపి ఉల్లి. అలాంటి విదేశీ ఎగుమతులను కేంద్ర ప్రభుత్వం గతంలో నిషేధించడంతో అమ్మకానికి రైతులు నానా అవస్థలు పడేవారు. ఈ ఏడాది రైతులకు సమస్య తొలగిపోయినది. స్థానికంగా అమ్మకం చేయాలంటే ధళారులు నిర్ణయించినదే ధర. మైదుకూరు కేంద్రంగా జిల్లాలోని దువ్వూరు, బి.మఠం మండలాలతో పాటు కర్నూలు జిల్లాలో సాగయ్యే ఉల్లికి పలు రోగాలను నయం చేసే గుణం కలిగి ఆరోగ్యప్రదాయినిగా పేరుగాంచినది. రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాలో సాగైన ఉల్లిపాయలకు ఈశాన్య ఆసియా దేశాలైన సింగపూర్, మలేషియా, దుబారు, హాంకాంగ్, శ్రీలంక దేశాలలో మంచి డిమాండ్ ఉంది. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై గతంలో నిషేధం విధించింది. ప్రస్తుతం నిషేధం ఎత్తివేయడంతో ధరలు బాగా ఉన్నాయి. మనదేశంలో వినియోగించే ఉల్లిపాయలకు, ఎగుమతుల అవసరాలకు పండించే ఉల్లిపాయలకు వ్యత్యాసం ఉంది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**